

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA

RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 28-09-2026 | సంపుటి: 3 | సంచిక: 235 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 28-09-2026 | V0LUME : 3 | ISSUE : 235 | PAGES: 8 | COST: 2/- |

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

## బరాజ్‌ల పునరుద్ధరణ
# ఖర్చు సర్కారుదే!



- వ్యయం భరించేందుకు నిర్మాణ సంస్థల విముఖత
- తొలుత వ్యయం తామే భరించాలని సర్కారు యోచన
- ఆ తర్వాత నిర్మాణ సంస్థల నుంచి రికవరీకి చర్యలు
- మేడిగడ్డ 7వ బ్లాక్ తొలగించాలా? ఎనఓఎఫ్ డ్యామ్‌గా మార్చాలా?
- ప్రభుత్వ పరిశీలనలో రెండు ప్రత్యామ్నాయాలు
- వచ్చే వానాకాలం నాటికి అన్నారం, సుందిళ్లను సిద్ధం చేసే యోచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 27:**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది! పునరుద్ధరణ ప్రక్రియలో మరింత జాప్యం జరగకుండా నివారించడానికి ప్రభుత్వం ఈ మేరకు యోచిస్తోంది. వాస్తవానికి బరాజ్‌ల పునరుద్ధరణ వ్యయాన్ని పూర్తిగా నిర్మాణ సంస్థలే భరించాల్సి ఉంటుందని

- మిగతా3లో

## 'ది ప్యారడైజ్'పై కేటీఆర్ ప్రశంసల జల్లు



- రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల మార్క్ దాటిన నాని సినిమా
- సుదర్శన్ 35ఎంఎంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేతో కలిసి మూవీ వీక్షణ
- దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, హీరో నానికి కేటీఆర్ అభినందనలు
- తెలంగాణ యాస, భాషతో సినిమా ఆకట్టుకుందంటూ ప్రశంస
- కేసీఆర్‌ను పోలిన 'శంకరన్న' పాత్ర సన్నివేశాలకు అభిమానుల సందడి

## ఓట్ల చోరీతో బీజేపీ పట్టుబడింది




- కేంద్ర ఎన్నికల కమిషనర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు: మంత్రి ఉత్తమ్
- దేశం కోసం కష్టపడుతున్న రాహుల్‌ను ప్రధాని చేసేందుకు ప్రజలు చూస్తున్నారు
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 27:** కేంద్రంలో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడుతూ పట్టుబడిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధ సంస్థ కాదని.. ఓటు హక్కు ఏ రాజకీయ పార్టీకి చెందిన ఆస్తి కాదన్నారు. ఓటర్ల జాబితా సవరణ,

- మిగతా3లో

## 41 కొత్త బార్లకు నోటిఫికేషన్

- జీహెచ్ఎంసీ పరిధిలో 14 బార్ల ఏర్పాటు
- ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 27
- సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు
- ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుము





## ఉగ్రవాదాన్ని ఉపేక్షించం

- సర్జికల్ స్ట్రైక్స్ కు పదేళ్లు పూర్తవుతున్న వేళ ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- బాలాకోట్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు స్పష్టమైన సందేశమన్న ప్రధాని
- ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానం
- దేశంపై కన్నెత్తితే తగిన ప్రతిస్పందన తప్పదని స్పష్టీకరణ

రూ.16 కోట్ల చిట్టీల మోసం..

## కుటుంబం పరార్

- చిట్టీలు, అధిక వడ్డీల పేరుతో 44 మంది నుంచి వసూళ్లు
- రమణారెడ్డి, భార్య సీత, కుమార్తె హరీషా రెడ్డిపై ఆరోపణలు
- ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఇంటికి తాళం వేసి పరారీ
- సైబరాబాద్ ఈఓడబ్ల్యూ ఆధ్వర్యంలో దర్యాప్తు
- మొత్తం బాధితుల బకాయిలు రూ.70 కోట్ల వరకు ఉంటాయని ఆరోపణ

2

## రైల్వే రూపురేఖలే మార్చేశాం

- మోదీ హయాంలో ఆధునికీకరణ వేగవంతమైందన్న అమిత్ షా
- దేశంలో తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలుకు పచ్చజెండా
- రూ.1,472 కోట్ల రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభం
- రైల్వే నెట్‌వర్క్‌లో 99.6 శాతం విద్యుదీకరణ పూర్తి
- 2030 నాటికి డీజిల్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించడమే లక్ష్యం





## ఫిబ్రవరి 17 నుంచి మినీ మేడారం జాతర

- నాలుగు రోజులపాటు సమ్మక్క-సారలమ్మలకు ప్రత్యేక పూజలు
- 2027 ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు నిర్వహణ
- తేదీలు ప్రకటించిన మేడారం పూజారుల సంఘం
- 19న భక్తుల దర్శనాలు, మొక్కుల చెల్లింపులు

## 8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- నేతన్నలు, రైతులు, విద్యార్థుల సమస్యలపై సమాధానం కోరిన కేటీఆర్
- హామీల అమలుకు స్పష్టమైన తేదీలు ప్రకటించాలని విజ్ఞప్తి
- సిరిసిల్ల అభివృద్ధిపై ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని డిమాండ్



## యూఎల్‌సీ దరఖాస్తులకు మోక్షం




- ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం
- అర్హమైన భూముల క్రమబద్ధీకరణకు అధికారులకు ఆదేశాలు
- మెమో నెం.48062 జారీ చేసిన రెవెన్యూ శాఖ
- జీవో 455, 456, 747, 92 పరిధిలోని దరఖాస్తుల పరిశీలన
- 22ఏ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

## కాంగ్రెస్ ఓడితే ఈవీఎంలపై నిందలు



- గెలిస్తే ఘనత.. ఓడితే ఈవీఎంలు, ఈసీపై ఆరోపణలా? : కిషన్ రెడ్డి
- రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్ నిరాధార ప్రచారం చేస్తున్నారంటూ విమర్శ
- "రాహుల్‌ను ప్రధాని చేయాల్సిన బాధ్యత ఈవీఎంలకు లేదు"
- ఎమర్జెన్సీ చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కు రాజ్యాంగంపై మాట్లాడే హక్కు లేదని వ్యాఖ్య
- ఎస్ఐఆర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే చర్యలని వెల్లడి

## హోటళ్లపై టీజీ సేఫ్ కొరడా

- 20 హోటళ్లు, రెస్టారెంట్లలో ఏకకాలంలో తనిఖీలు
- నిబంధనల ఉల్లంఘనతో 11 సంస్థల ఫుడ్ లైసెన్సులు సస్పెండ్
- మరో ఆరింటికి ఇంప్రూవ్ మెంట్, మూడింటికి షోకాజ్ నోటీసులు
- వంటశాలల్లో బొద్దింకలు, ఎలుకలు.. కుళ్లిన ఆహార పదార్థాలు
- ఆదేశాలు బేఖాతర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక



# ది ప్యారడైజ్‌పై కేటీఆర్ ప్రశంసల జల్లు

- రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల మార్క్ దాటిన నాని సినిమా
- సుదర్శన్ 35ఎంఎంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేతో కలిసి మూవీ వీక్షణ
- దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, హీరో నానికి కేటీఆర్ అభినందనలు
- తెలంగాణ యాస, భాషతో సినిమా ఆకట్టుకుందంటూ ప్రశంస
- కేసీఆర్‌ను పోలిన 'శంకరన్న' పాత్ర సన్నివేశాలకు అభిమానుల సందడి



హైదరాబాద్, సెప్టెంబరు 27:

న్యాచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన 'ది ప్యారడైజ్'పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ పిరియాడిక్ యాక్షన్ డ్రామా రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటింది. తాజాగా కేటీఆర్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో కలిసి సినిమాను వీక్షించారు.

**శ్రీకాంత్ ఓదెల, నానికి అభినందనలు**

సినిమా చూసిన అనంతరం కేటీఆర్ తన స్పందనను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అస్థిత్వం కోసం ఆరాటం, అణిచివేతపై పోరాటం వంటి అంశాలను సినిమాలో బలంగా చూపించారని పేర్కొంటూ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలను అభినందించారు. కథానాయకుడి పాత్రలో జీవించిన నానికి శుభాకాంక్షలు తెలిపారు. నటుడు ప్రియదర్శికి ప్రత్యేకంగా అభినందనలు చెబుతూ, "చావు నోట్లో తల పెట్టయినా.. మీకు గుర్తింపు తెస్తా!!" అంటూ సినిమాలోని భావోద్వేగ అంశాన్ని ప్రస్తావించారు.

**'శంకరన్న' సన్నివేశాలకు సందడి**

'ది ప్యారడైజ్'లో కేసీఆర్‌ను పోలిన ఎమ్మెల్యే శంకరన్న పాత్ర కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ పాత్రకు సంబంధించిన సన్నివేశాలు తెరపై కనిపించగానే అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సైతం చిరునవ్వు చిందించారు. సినిమా ముగిసిన అనంతరం థియేటర్ బయట మాట్లాడిన ఆయన.. ఒక సమాజంపై అణిచివేత జరిగినప్పుడు ఓ నాయకుడు ముందుకొచ్చి పోరాటం చేసి ఆ సమాజానికి గుర్తింపు తీసుకురావడం ప్రధానాంశంగా సినిమా తెరకెక్కిందని, కథ అద్భుతంగా ఉందని అన్నారు. తెలంగాణ నేపథ్యం, యాస, భాషను సినిమాలో సహజంగా మేళవించడం ఆకట్టుకుందని ప్రశంసించారు.

# హోటళ్లపై టీజీ సేఫ్ కొరడా

- 20 హోటళ్లు, రెస్టారెంట్లలో ఏకకాలంలో తనిఖీలు
- నిబంధనల ఉల్లంఘనతో 11 సంస్థల ఫుడ్ లైసెన్సులు సస్పెండ్
- మరో ఆరింటికి ఇంప్రూవ్‌మెంట్, మూడింటికి షోకాజ్ నోటీసులు
- వంటశాలల్లో బొద్దింకలు, ఎలుకలు.. కుళ్లిన ఆహార పదార్థాలు
- ఆదేశాలు బేఖాతర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక




హైదరాబాద్, సెప్టెంబరు 27:

నగరంలోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎస్సెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు కొరడా ఝుళిపించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 ప్రత్యేక బృందాలు గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్‌సిటీ పరిధిలోని 20 ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో శనివారం ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించిన 11 సంస్థల ఫుడ్ లైసెన్సులను సస్పెండ్ చేసి, కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. మరో ఆరు సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు, మూడింటికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**వంటశాలల్లో అపరిశుభ్రత**

తనిఖీల్లో పలు రెస్టారెంట్ల వంటశాలల్లో ఆహార భద్రత ప్రమాణాల దారుణ పరిస్థితులు బయటపడ్డాయి. హైటెక్‌సిటీలోని మోనాస్టరీలో ఫంగస్ పట్టిన కూరగాయలు, కుళ్లిన గుడ్లు, లేబుల్స్ లేని ఉత్పత్తులు గుర్తించారు. గచ్చిబౌలిలోని శివాని ది రెస్టారెంట్ అండ్ బార్‌లో మురికిగా ఉన్న కిచెన్ ఫ్లోర్, పురుగులు పట్టిన ధాన్యాలు లభించాయి. అల్ సబా రెస్టారెంట్‌లో జిడ్డుపట్టిన చిమ్నీలు, సిగరెట్ బడ్స్, గుట్కా నములుతున్న సిబ్బందితో పాటు ఫ్రిజ్‌లలో ఉడికించిన ఆహారం, పచ్చి మాంసాన్ని కలిపి ఉంచినట్లు గుర్తించారు. మాదాపూర్‌లోని లక్కీ మల్టీకుసిన్, సాయి రామ్ మెస్‌లలో అపరిశుభ్రమైన ఫ్రిజ్‌లు, పురుగులు పట్టిన మైదా, మినపప్పును గుర్తించి అక్కడికక్కడే తొలగించారు. ఉడుపీస్ ఉపహార్‌లో డ్రెయిన్లు బ్లాక్ కావడంతో దుర్వాసన రావడంతో పాటు ఎలుకల సంచారం గుర్తించారు. కోల్ స్పార్క్‌లో ఫంగస్ పట్టిన 22 కిలోల వేరుశెనగలు, 25 కిలోల మిరియాలు, 8.9 కిలోల జీడిపప్పును స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.

**లైసెన్సుల సస్పెన్షన్**

కాంచీ కేఫ్‌లో సాలెగూళ్లతో కూడిన సీలింగ్, పాడైన ముడిసరుకులు బయటపడగా.. ఇనార్బిట్ మాల్‌లోని అమ్ ఆహా తెలుగు కిచెన్‌లో ఎలుకలు కొరికిన మయోనైజ్ ప్యాకెట్లు, ఆహార పదార్థాల్లో బొద్దింకలు కనిపించాయి. అదే మాల్‌లోని ఫ్యూజన్ 9, ఆమ్నీషియా స్కై బార్‌లో ఎలుకల మల విసర్జన ఆనవాళ్లు, ఫంగస్ పట్టిన క్యారెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు అందుకున్న వాటిలో మాదాపూర్‌లోని రమేశ్వరం కేఫ్, గచ్చిబౌలిలోని ఇష్తా (విరున్తా ఫుడ్స్), సాహిబ్స్ బార్బెక్యూ, పక్కా లోకల్, గచ్చిబౌలి హోటల్ షాదాబ్, షా ఘౌస్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఆయా సంస్థల్లో త్వరలో పునఃతనిఖీలు నిర్వహించి, పారిశుధ్య చర్యలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో హోటల్ అవసా, మినర్వా గ్రాండ్, 63 డిగ్రీస్ మోడర్న్ రీజినల్ బఫే వంటి ఇతర ప్రముఖ సంస్థల వంటశాలలను కూడా పరిశీలించినట్లు టీజీ సేఫ్ అధికారులు వెల్లడించారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ కార్యకలాపాలు కొనసాగించే సంస్థలపై తదుపరి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ ఓడితే ఈవీఎంలపై నిందలు: కిషన్‌రెడ్డి

- గెలిస్తే ఘనత.. ఓడితే ఈవీఎంలు, ఈసీపై ఆరోపణలా?
- రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్ నిరాధార ప్రచారం చేస్తున్నారంటూ విమర్శ
- "రాహుల్‌ను ప్రధాని చేయాల్సిన బాధ్యత ఈవీఎంలకు లేదు"
- ఎమర్జెన్సీ చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కు రాజ్యాంగంపై మాట్లాడే హక్కు లేదని వ్యాఖ్య
- ఎస్ఐఆర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే చర్యలని వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 27:

బీజేపీ ఎప్పుడూ ఓట్లను చోరీ చేయదని, దేశ ప్రజల మనసులను గెలుచుకుంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే దాన్ని తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి ఎదురైతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ఈసీపై ఆరోపణలు సరికాదు**

కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణలో ఎన్నికల సంఘం సక్రమంగా పనిచేస్తోందని చెప్పి.. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధిస్తే మాత్రం ఈవీఎంలు, ఎన్నికల సంఘాన్ని తప్పుబట్టడం ఆ పార్టీ అపరిపక్వతకు నిదర్శనమని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. "రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాల్సిన బాధ్యత ఈవీఎంలకు లేదు" అని వ్యాఖ్యానించారు. 1975లో ఎమర్జెన్సీ విధించి పౌర హక్కులను కాలరాసిన కాంగ్రెస్‌కు రాజ్యాంగంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.

**రేవంత్‌పై విమర్శలు**

తెలంగాణ ప్రజలు ఓటేసి గెలిపించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకు వెళ్లి సోనియాగాంధీ కుటుంబం కోసం ప్రాణాలు అర్పిస్తానని చెప్పడం సిగ్గుచేటని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పట్టించుకోకుండా గాంధీ కుటుంబ సేవలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ఆర్మీ చీఫ్, సర్జికల్ స్ట్రైక్స్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, లోక్‌సభ స్పీకర్, సీజేఐ, ఈడీ, సీబీఐ, పార్లమెంట్, జీఎస్టీ వంటి వ్యవస్థలపై రాహుల్‌గాంధీ అనుమానాలు వ్యక్తం చేస్తూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని తమ కుటుంబమే పాలించాలనే రాచరిక ధోరణి ఆయన వ్యాఖ్యల్లో కనిపిస్తోందని అన్నారు.

**మోదీ పాలనపై ప్రస్తావన**

నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల అభివృద్ధి, ఉచిత రేషన్ వంటి సంక్షేమ కార్యక్రమాలతో కోట్లాది మందికి ప్రయోజనం కలిగిందని చెప్పారు. మోదీ పాలనలో అవినీతి ఆరోపణలు లేవని పేర్కొన్నారు. స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని, కాంగ్రెస్ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

**ఎస్ఐఆర్‌పై కిషన్‌రెడ్డి వివరణ**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై స్పందిస్తూ పశ్చిమ బెంగాల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు. చనిపోయినవారు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియను రాజకీయ లబ్ధి కోసం తప్పుబట్టడం సరికాదన్నారు. ఎన్నికల వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే చర్యలను స్వాగతించాలని కోరారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంపై ఉత్సవ సమితి, పోలీసు, మున్సిపల్ సిబ్బంది, నగర ప్రజలకు కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు

# రూ.16 కోట్ల చిట్టీల మోసం.. కుటుంబం పరార్

- చిట్టీలు, అధిక వడ్డీల పేరుతో 44 మంది నుంచి వసూళ్లు
- రమణారెడ్డి, భార్య సీత, కుమార్తె హారీషా రెడ్డిపై ఆరోపణలు
- ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఇంటికి తాళం వేసి పరారీ
- సైబరాబాద్ ఈఓడబ్ల్యూ ఆధ్వర్యంలో దర్యాప్తు
- మొత్తం బాధితుల బకాయిలు రూ.70 కోట్ల వరకు ఉంటాయని ఆరోపణ

హైదరాబాద్, సెప్టెంబరు 27:

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చిట్టీల మోసం వెలుగుచూసింది. చిట్టీలు, అధిక వడ్డీల పేరుతో దాదాపు 44 మంది నుంచి రూ.16 కోట్లకు పైగా వసూలు చేసిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పరారైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీకి చెందిన రమణారెడ్డి, ఆయన భార్య సీత, కుమార్తె హారీషా రెడ్డి ఈ వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

**ఫోన్లు స్విచ్ఛాఫ్.. ఈఓడబ్ల్యూ దర్యాప్తు**

బాధితులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి పెంచడంతో నిందితులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి, ఇంటికి తాళం వేసి కనిపించకుండా పోయినట్లు సమాచారం. దీంతో మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసుల ను ఆశ్రయించారు. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకు న్న సైబరాబాద్ ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు, కాల్ డేటా తదితర వివరాలను పరిశీలిస్తూ ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.



**పెళ్లిళ్లు, ఇళ్ల కోసం దాచుకున్న సొమ్ము**

రమణారెడ్డి కుటుంబంతో తమకు చాలాకాలంగా పరిచయం ఉండటంతో పూర్తి నమ్మకంతో డబ్బులు అప్పగించామని బాధితులు చెబుతున్నారు. కుమార్తెల పెళ్లిళ్ల కోసం, ఇళ్ల నిర్మాణాల కోసం దాచుకున్న సొమ్మును చిట్టీల్లో పెట్టామని, ఇప్పుడు ఆ డబ్బు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో బాధితుల సంఖ్య 44 మందికి మించి ఉండొచ్చని, తమకు రావాల్సిన మొత్తం రూ.70 కోట్ల వరకు ఉంటుందని మరికొందరు ఆరోపిస్తున్నారు. నిందితులను త్వరగా పట్టుకుని తమ సొమ్మును రికవరీ చేయాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు.

# 41 కొత్త బార్లకు నోటిఫికేషన్

- జీహెచ్ఎంసీ పరిధిలో 14 బార్ల ఏర్పాటు
- ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 27
- సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు
- ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుము

హైదరాబాద్, సెప్టెంబరు 27:

తెలంగాణలో కొత్తగా 41 టూబీ (2B) బార్ లైసెన్సుల జారీకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి, అర్హత ఉన్న వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. సోమవారం నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష ఫీజుగా నిర్ణయించారు.

**జీహెచ్ఎంసీ పరిధిలో 14**

మొత్తం 41 కొత్త 2B బార్లలో 14 జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేయనున్నారు. మరో 27 బార్లను రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేయనున్నట్లు శాఖ వెల్లడించింది. నిర్ణీత ఫీజు చెల్లించి, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

**లైసెన్సుకు నిబంధనలు**

2B బార్ లైసెన్సుల మంజూరుకు ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన ప్రక్రియను అనుసరించాలి. ప్రీ-క్లియరెన్స్ కు ఫారమ్ 1(ఏ), అనంతరం లైసెన్స్ దరఖాస్తుకు ఫారమ్ 1(బీ) తదితర నిబంధనలు వర్తిస్తాయి. బార్ ఎక్సైజ్ పన్ను ఆయా ప్రాంతాల జనాభా ఆధారంగా నిర్ణయిస్తారు. లైసెన్స్ పొందిన వారు మద్యం విక్రయ సమయాలు, వయోపరిమితి, ఇతర ఎక్సైజ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

# యూఎల్‌సీ దరఖాస్తులకు మోక్షం

- ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం
- అర్హమైన భూముల క్రమబద్ధీకరణకు అధికారులకు ఆదేశాలు
- మెమో నెం.48062 జారీ చేసిన రెవెన్యూ శాఖ
- జీవో 455, 456, 747, 92 పరిధిలోని దరఖాస్తుల పరిశీలన
- 22ఏ భూ సమస్యల పరిష్కారానికీ చర్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27:

రాష్ట్రంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హత కలిగిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ మెమో నెం.48062 జారీ చేసింది. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పెండింగ్ కేసుల పరిశీలన యూఎల్‌సీ దరఖాస్తులకు సంబంధించి 2016లోనే జీవోలు జారీ అయినప్పటికీ వాటి అమలు జరగకపోవడంతో వేలాది కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయని మంత్రి తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు జీవో నెం.455, 456, 747, 92 కింద వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హత ఉన్న కేసులను నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు 22ఏ సమస్యలపైనా దృష్టి నిషేధిత ఆస్తుల జాబితాకు




సంబంధించిన 22ఏ సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే ఈ అంశంపై మూడు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొంది. జీవో 118, జీవో 76కు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేయడంతో 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ చట్టపరమైన అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఉన్న అడ్డంకులను తొలగించినట్లు వెల్లడించింది. మిగిలిన 22ఏ భూ సమస్యలను కూడా ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది

# బరాజ్‌ల పునరుద్ధరణ ఖర్చు సర్కారుదే!

-మొదటిపేజీ తరువాయి

గతంలో సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. పునరుద్ధరణ బాధ్యతలు స్వీకరించి వ్యయాన్ని పూర్తిగా భరించాలంటూ ప్రాజెక్టు ఇంజనీర్లు పదుల సంఖ్యలో నిర్మాణ సంస్థలకు ఉత్తరాలు రాయగా, పునరుద్ధరణ చర్యలకు సహకరిస్తామంటూనే వ్యయం విషయంలో తమ బాధ్యత ఉండబోదని స్పష్టం చేశాయి. వచ్చే అక్టోబర్ 21తో మేడిగడ్డ బరాజ్ కుంగిపోయి మూడేళ్లు పూర్తికానుంది. బరాజ్‌ల పునరుద్ధరణలో భాగంగా వాటిలో లోపాలను గుర్తించడానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ సిఫారసు చేసిన వివిధ రకాల పరీక్షలను బరాజ్‌ల నిర్మాణ సంస్థల పర్యవేక్షణలోనే జరిగినా, వాటికైన వ్యయాన్ని ప్రభుత్వమే భరించింది. బరాజ్‌ల పునరుద్ధరణ పనుల వ్యయాన్ని తొలుత తామే భరించి ఆ తర్వాత నిర్మాణ సంస్థల నుంచి రికవరీ చేసేందుకు ప్రయత్నించాలని ప్రభుత్వం భావిస్తోంది. వ్యయాన్ని భరించేందుకు నిర్మాణ సంస్థలు అంగీకరించకపోవడంతో ప్రభుత్వమే భరించక తప్పనిపరిస్థితి ఏర్పడింది. బరాజ్‌ల పునరుద్ధరణ పనులకు సంబంధించిన డిజైన్లకు తుది రూపం ఇచ్చి అక్టోబర్ 5లోగా అందజేస్తామని డిజైన్ కన్సల్టెన్సీ ఆఫ్ ఇండియా సంస్థ ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. ఆ తర్వాత డిజైన్లకు కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ నుంచి ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత పునరుద్ధరణ పనులకు అంచనాలు రూపొందించి పరిపాలనపర అనుమతులు జారీ చేయనున్నారు.



**ఎన్‌ఓఎఫ్ డ్యామ్‌గా మేడిగడ్డ ఏడో బ్లాక్!**

మేడిగడ్డ బరాజ్ ఏడో నంబర్ బ్లాక్ కుంగిపోయిన నేపథ్యంలో దాన్ని పూర్తిగా తొలగించి కొత్త బ్లాక్ నిర్మించాలా? లేక ఆ బ్లాక్‌ను నాన్ ఓవర్ ఫ్లో(ఎన్‌ఓఎఫ్) డ్యామ్‌గా మార్చాలా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఎన్‌ఓఎఫ్ డ్యామ్‌గా మార్చాలని నిర్ణయిస్తే ఏడో బ్లాక్ గేట్లను తొలగించి పూర్తిగా కాంక్రీట్ గోడగా పటిష్టం చేస్తారు. దీంతో ఆ మేరకు బరాజ్ నుంచి నీళ్లను కిందికి విడుదల చేసే సామర్థ్యం తగ్గిపోనుంది. ప్రత్యామ్నాయంగా బరాజ్‌లకి ఎగువన రెండు వైపులా వరద మళ్లింపు కాల్వలను నిర్మిస్తారు. ఏడో బ్లాక్ పూర్తిగా తొలగించి కొత్త బ్లాక్ నిర్మించడానికి ఏళ్లు పట్టే అవకాశం ఉంది. దానిని తొలగించే సమయంలో ఇరువైపులా ఉన్న బ్లాకులకు నష్టం జరిగే ప్రమాదం ఉందని ఇప్పటికే ఎన్డీఎస్‌ఏ నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఏడో బ్లాక్‌ను ఎన్‌ఓఎఫ్ డ్యామ్‌గా మార్చేందుకే ప్రభుత్వం మొగ్గుచూపే అవకాశం ఉంది.

**బరాజ్‌లకు దిగువన డయాఫ్రమ్‌వాల్**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకి రక్షణగా సికెంట్ పైల్స్ టెక్నాలజీతో నిర్మించిన పునాదులు నూటికి నూరు శాతం పనికి రావని పరీక్షల్లో తేలిందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. సికెంట్ పైల్స్ విఫలం కావడంతోనే గతంలో బరాజ్‌ల పునాదుల కింద బుంగలు ఏర్పడి భారీగా నీళ్లు లీకయ్యాయి. బరాజ్‌లకి ప్రత్యామ్నాయ రక్షణగా దిగువన కొంత దూరంలో డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని డిజైన్ కన్సల్టెన్సీ సిఫారసు చేసింది. సికెంట్ పైల్స్ విఫలమైనందున డయాఫ్రమ్‌వాల్ పునాదుల (కటాఫ్‌వాల్స్)ను షీట్‌పైల్స్ టెక్నాలజీతో నిర్మించనున్నారు. మూడు బరాజ్‌ల పునాదుల కింద భారీ సంఖ్యలో బుంగలున్నట్టు గుర్తించగా, వాటిని గ్రౌంటింగ్‌తో పూడ్చివేయాలని నిర్ణయించారు.

**పునరుద్ధరణకు రూ.1,500 కోట్లు?**

మేడిగడ్డ బరాజ్ తుది అంచనా వ్యయాన్ని పరిగణనలోకి తీసుకున్నా ఏడో బాల్క్ పునర్నిర్మాణానికి రూ.500కోట్ల వ్యయం కానుందని అంచనా. మూడు బరాజ్‌లకు దిగువన మూడు డయాఫ్రమ్ వాల్స్ నిర్మించాల్సి ఉండగా, ఒక్కో డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి సుమారు. 300 కోట్లు కానుందని భావిస్తున్నారు. బుంగలను పూడ్చివేయడానికి గ్రౌటింగ్, ఇతర మరమ్మతులు కలిపి బరాజ్‌ల పునరుద్ధరణకు ప్రాథమికంగా రూ.1500 కోట్ల వ్యయం కానుందని అంచనా వేశారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలోని బుంగలను గ్రౌటింగ్‌తో పూడ్చివేసి వాటిలో నీళ్లను నిల్వ చేసే అవకాశాన్ని పరిశీలించాలని పభుత్వం భావిస్తోంది. వచ్చే వానాకాలంలోనూ కరువు పరిస్థితులు కొనసాగితే అన్నారం నుంచి సుందిళ్లకు, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్లను ఎత్తిపోసేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్ణయించింది. మేడిగడ్డ బరాజ్‌లో తీవ్ర సమస్యలుండటంతో పునరుద్ధరణకు అధిక సమయం పట్టే అవకాశం ఉంది.

## ఓట్ల చోరీతో బీజేపీ పట్టుబడింది

-మొదటిపేజీ తరువాయి




డేటా నిర్వహణ, పేర్ల తొలగింపు--చేర్పులకు సంబంధించి తలెత్తిన సందేహాలపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను, స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. అలాగే నేరేడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ దేశంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) పూర్తి పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్వయంగా ఎన్నికల సంఘంలోని మిగిలిన ఇద్దరు కమిషనర్లే సీఈసీ పక్షపాత వైఖరిని తప్పుబట్టారని చెప్పారు. ఇది తీవ్రమైన రాజ్యాంగ సంక్షోభమని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారు నేడు ఆధారాలతో సహా పట్టుబడ్డారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొన్నేళ్లుగా నిరుపేదల కోసం దేశాన్ని కాపాడేందుకు నిరంతరం కష్టపడుతున్నారని.. కాబట్టి ఆయన్ను దేశ ప్రధానిని చేయాలని ప్రజలు చూస్తున్నారని తెలిపారు.

**16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశాం**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని.. ఈ స్మార్ట్ రేషన్‌కార్డులు పేదోడి ఆత్మగౌరవం అని మంత్రి ఉత్త మ్ చెప్పారు. గత ప్రభుత్వం రూ. 10,500 కోట్లు ఖర్చు చేసి ఇచ్చిన రేషన్ దొడ్డు బియ్యం ప్రజలు తినేందుకు పనికిరాకుండా ఉండేదని.. కోళ్ల ఫారాలకు, బీర్ల కంపెనీలకు, రైస్ మిల్లుల దందాలకుమాత్రమే ఉపయోగపడేదని విమర్శించారు.

## పట్టభద్రులు ఓటరు నమోదులో ముందుండాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 :** నార్సింగిలో నిర్వహించిన పట్టభద్రుల సమ్మేళనం – 2026 కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు సంబంధించిన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యావంతుల పాత్ర ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని విద్యావంతుల ఆలోచనలు, సూచనలు ప్రజా విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అందుకే ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పట్టభద్రుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావచ్చని మంత్రి తెలిపారు. యువత, ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి నమోదు ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ప్రతి ఓటు విలువైనదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జి భీమ్ భరత్, నైనా జైస్వాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పట్టభద్రులతో నేరుగా మాట్లాడి ఓటరు నమోదుకు సంబంధించిన వివరాలను వివరించారు. అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు.

## 8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- నేతన్నలు, రైతులు, విద్యార్థుల సమస్యలపై సమాధానం కోరిన కేటీఆర్
- హామీల అమలుకు స్పష్టమైన తేదీలు ప్రకటించాలని విజ్ఞప్తి
- సిరిసిల్ల అభివృద్ధిపై ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని డిమాండ్

**హైదరాబాద్/సిరిసిల్ల, సెప్టెంబర్ 27 :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పలు అంశాలపై స్పందించారు. ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు వస్తున్న సందర్భంగా రాజకీయ విమర్శలకు బదులుగా ప్రజల సమస్యలపై సమాధానాలు చెప్పాలని కోరారు. సిరిసిల్ల అభివృద్ధి, భూముల వివాదాలు, నేత కార్మికుల సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బీఆర్‌ఎస్ నాయకులు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, అందులో 2,400 ఎకరాలు తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని కేటీఆర్ కోరారు. ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబరు, ఎవరి పేరుపై ఎంత భూమి ఉందో ప్రజలకు తెలియజేస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణల్లో నిజం ఉంటే ఆధారాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని, లేకపోతే సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ అన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో రైతుల అభ్యర్థనల మేరకు మాత్రమే రికార్డులు సవరించామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో జిల్లాలో జరిగిన భూ పంపిణీ వివరాలను కూడా వెల్లడించారు. సిరిసిల్ల నేత కార్మికుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకం, పాఠశాల దుస్తులు, కేసీఆర్ కిట్, పండుగ కానుకలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా ఉపాధి కల్పించిందని కేటీఆర్ తెలిపారు. దీంతో మరమగ్గాల పరిశ్రమ బలోపేతమై వేలాది కుటుంబాలకు ఉపాధి లభించిందని పేర్కొన్నారు. వస్త్రోత్పత్తి రంగంలో సిరిసిల్ల ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి నేత కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపిందని కేటీఆర్ ఆరోపించారు. పెండింగ్ బకాయిల చెల్లింపులు, నూలు రాయితీ, వస్త్ర పరిశ్రమకు అవసరమైన ముడి సరుకు సరఫరాపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. నేత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నేతన్నలు, రైతులు, విద్యార్థులు సహా అన్ని వర్గాలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కేటీఆర్ కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కాలపట్టిక ప్రకటించాలని, సిరిసిల్ల అభివృద్ధిపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందుంచిన వాగ్దానాల అమలుపై ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు.



## ఫిబ్రవరి 17 నుంచి మినీ మేడారం జాతర

- నాలుగు రోజులపాటు సమ్మక్క-సారలమ్మలకు ప్రత్యేక పూజలు
- 2027 ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు నిర్వహణ
- తేదీలు ప్రకటించిన మేడారం పూజారుల సంఘం
- 19న భక్తుల దర్శనాలు, మొక్కుల చెల్లింపులు

**ములుగు, సెప్టెంబర్ 27:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మేడారంలో శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతర తేదీలు ఖరారయ్యాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో 2027 ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు నాలుగు రోజులపాటు జాతర నిర్వహించనున్నట్లు పూజారుల (వడ్డెలు) సంఘం ప్రకటించింది. ఈ మేరకు జాతర తేదీలు, కార్యక్రమాల వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రికి లేఖ ద్వారా తెలియజేసింది. నాలుగు రోజులపాటు పూజలు ఫిబ్రవరి 17న సంప్రదాయ పూజలతో మినీ జాతర ప్రారంభం కానుంది. 18న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 19న భక్తుల దర్శనాలు, మొక్కుల చెల్లింపులకు అవకాశం కల్పిస్తారు. 20న ముగింపు ఉత్సవాలతో జాతర పూర్తవుతుంది. ఆదివాసీ గిరిజన సంప్రదాయాల ప్రకారం మేడారంలో సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. రెండేళ్లకోసారి మహాజాతర నిర్వహిస్తుండగా, అది లేని మరుసటి ఏడాది మినీ జాతర జరుగుతుంది. మహాజాతర సమయంలో రద్దీ కారణంగా అమ్మవార్లను దర్శించుకోలేని వారు, మొక్కులు చెల్లించుకోలేని భక్తులు మినీ జాతరకు పెద్ద సంఖ్యలో మేడారం చేరుకుంటారు.

# కాంగ్రెస్‌లో అభ్యర్థుల ప్రకటనపై కొత్త పంచాయితీ

- పరకాలలో రేవంత్ ప్రకటనపై అభ్యంతరాలు తెలిపిన మహేష్‌గౌడ్
- ఇప్పుడు తాను నిజామాబాద్ నుంచి పోటీ చేస్తానన్న పీసీసీ చీఫ్
- సొంత నియోజకవర్గం లేకపోవడంతో జిల్లా నేతల్లో మొదలైన టెన్షన్
- ఎవరి సీటుకు ఎసరు పెడతారోనని కాంగ్రెస్ నేతల్లో చర్చ
- రేవంత్ టీమ్‌లోనూ మహేష్‌గౌడ్ ప్రకటనపై చర్చ

**హైదరాబాద్, సెప్టెంబరు 27:**




తెలంగాణ కాంగ్రెస్‌లో అభ్యర్థుల ముందస్తు ప్రకటన వ్యవహారం మరోసారి చర్చకు దారితీసింది. పరకాల పర్యటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుపై అప్పట్లో పార్టీలో పెద్ద దుమారమే రేగింది. సహజమైన కాంగ్రెస్ విధానానికి భిన్నంగా ఎన్నికలకు ముందే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారన్న ప్రశ్నలు పార్టీ నేతల నుంచి వచ్చాయి. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ సైతం ముందస్తుగా ఎవరైనా అభ్యర్థులను ప్రకటించినా అది చెల్లదని స్పష్టం చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడు అదే అంశాన్ని గుర్తు చేస్తూ కాంగ్రెస్‌లో మరో వాదన తెరపైకి వచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా నుంచి పోటీ చేస్తానని మహేష్‌గౌడ్ ప్రకటించారు. అయితే ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారో తర్వాత వెల్లడిస్తానని చెప్పారు.

**ఎవరి సీటుకు ఎసరు?**

మహేష్‌గౌడ్ ప్రకటన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో మాత్రం అలజడి రేపింది. సొంత జిల్లా అయినప్పటికీ ఆయనకు ప్రస్తుతం నిర్దిష్టంగా సొంత నియోజకవర్గం లేదు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లోనూ ఎమ్మెల్యేలు లేదా పార్టీ ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. దీంతో పీసీసీ చీఫ్ పోటీకి దిగితే ఎవరికి ఇబ్బంది ఎదురవుతుందనే చర్చ మొదలైంది. ఇదే క్రమంలో పరకాల వ్యవహారాన్ని కొందరు నేతలు ప్రస్తావిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను తిరిగి గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చినప్పుడు ముందస్తు అభ్యర్థిత్వ ప్రకటనపై అభ్యంతరం వ్యక్తం చేసిన పీసీసీ చీఫ్.. ఇప్పుడు తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ఎలా ప్రకటిస్తారన్న ప్రశ్నను జిల్లా నేతలు లేవనెత్తుతున్నారు.

**ఆర్మూర్‌పై అప్పట్లో చర్చ**

మహేష్‌గౌడ్‌కు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ ఉంది. ఆర్మూర్ నుంచి ఆయన బరిలో దిగవచ్చన్న ప్రచారం కూడా గతంలో జరిగింది. తాజాగా నిజామాబాద్ జిల్లా నుంచి పోటీ చేస్తానని స్వయంగా చెప్పడంతో ఆ చర్చ మళ్లీ ఊపందుకుంది. మహేష్‌గౌడ్ ఏ నియోజకవర్గాన్ని ఎంచుకుంటారన్నది స్పష్టత రావాల్సి ఉన్నప్పటికీ.. ఆయన ప్రకటనతో జిల్లా కాంగ్రెస్‌లో మాత్రం ముందస్తుగానే రాజకీయ లెక్కలు మొదలయ్యాయి. ఇదే అంశంపై రేవంత్ వర్గం నేతలు కూడా అంతర్గతంగా చర్చిస్తున్నట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్‌లో అభ్యర్థుల ఎంపికపై మరోసారి గరం గరం చర్చ సాగుతోంది.



## ఉగ్రవాదాన్ని ఉపేక్షించం

- సర్జికల్ స్ట్రైక్స్ కు పదేళ్లు పూర్తవుతున్న వేళ ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- బాలాకోట్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు స్పష్టమైన సందేశమన్న ప్రధాని
- ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానం
- దేశంపై కన్నెత్తితే తగిన ప్రతిస్పందన తప్పదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:**

ఉగ్రవాదులు భారత్‌పై కన్నెత్తి చూస్తే కఠిన ప్రతిస్పందన తప్పదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 2016లో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్‌కు పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆదివారం 138వ 'మన్ కీ బాత్'లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. బాలాకోట్ వైమానిక దాడుల నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు ఉగ్రవాదంపై భారత్ తన వైఖరిని పదేపదే చాటిందన్నారు.

**నిర్ణయాత్మక ప్రతిస్పందన**

2016 సెప్టెంబర్ 2829 తేదీల్లో భారత సైన్యం నియంత్రణ రేఖ దాటి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిన విషయాన్ని మోదీ గుర్తుచేశారు. భారత సైనికుల చర్య ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నారు. ఉగ్రదాడులతో భారత్ దీర్ఘకాలంగా ఎదుర్కొన్న పరిస్థితులకు సర్జికల్ స్ట్రైక్స్ నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచాయని చెప్పారు.

**జీరో టాలరెన్స్ విధానం**

గతంలో ఉగ్రదాడుల అనంతరం పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వచ్చినా వాటికి తగిన ప్రాధాన్యం లభించేది కాదని మోదీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం భారత్ ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానంతో ముందుకెళ్తోందని, దాని ఫలితాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

## ఆండ్రాయిడ్‌లో వాట్సాప్‌కు కొత్త లుక్



- ఫ్లోటింగ్ నావిగేషన్ బార్‌తో సరికొత్త డిజైన్
- ఐఫోన్ తరహా లుక్‌పై వాట్సాప్ ప్రయోగాలు
- చాట్స్, కమ్యూనిటీస్, అప్‌డేట్స్, కాల్స్ ట్యాబ్‌లకు కొత్త రూపు
- ప్రస్తుతం అంతర్గత పరీక్షల దశలోనే ఫీచర్
- బిజినెస్ ఖాతాల సెటప్‌కు కొత్త ఏఐ టూల్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:**

ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఆండ్రాయిడ్ యూజర్ల కోసం సరికొత్త డిజైన్‌ను పరీక్షిస్తోంది. ఐఫోన్ యాప్‌ను తలపించేలా కింది భాగంలోని నావిగేషన్ బార్‌కు కొత్త రూపు తీసుకురానుంది. ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ 2.26.38.10లో ఈ మార్పు కనిపించింది. కొత్త డిజైన్‌లో చాట్స్, కమ్యూనిటీస్, అప్‌డేట్స్, కాల్స్ ట్యాబ్‌లతో కూడిన నావిగేషన్ బార్ గుండ్రని అంచులతో ప్రత్యేకంగా తేలియాడుతున్నట్లు కనిపిస్తుంది. యాపిల్ ఐఓఎస్‌లోని 'లిక్విడ్ గ్లాస్' డిజైన్‌ను కొంత వరకు తలపిస్తున్నప్పటికీ, గూగుల్ డిజైన్ సూత్రాలకు అనుగుణంగానే వాట్సాప్ మార్పులు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా లైట్ థీమ్‌లో కొత్త లుక్ మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

**మూడేళ్ల క్రితమే మార్పు**

సుమారు మూడేళ్ల క్రితం ఆండ్రాయిడ్ యాప్‌లో నావిగేషన్ ట్యాబ్‌లను పైభాగం నుంచి కిందకు వాట్సాప్ మార్చింది. ఇప్పుడు అదే నావిగేషన్ వ్యవస్థకు ఆధునిక హంగులు జోడించే పనిలో పడింది. అయితే కొత్త డిజైన్ ప్రస్తుతం అంతర్గత పరీక్షలకే పరిమితమైంది. బీటా టెస్టర్లకు కూడా ఇంకా అందుబాటులోకి రాలేదు. యూజర్లందరికీ ఎప్పుడు విడుదల చేస్తారనే విషయంపై వాట్సాప్ అధికారిక ప్రకటన చేయలేదు.

**బిజినెస్ ఖాతాలకు ఏఐ సాయం**

మరోవైపు వాట్సాప్ బిజినెస్ ఖాతాల ఏర్పాటు ప్రక్రియను సులభతరం చేసేందుకు మెటా 'వాట్సాప్ బిజినెస్ టూల్స్ ఎంసీపీ'ని తీసుకొచ్చింది. దీని సాయంతో చాట్‌జీపీటీ, క్లాడ్ వంటి ఏఐ కోడింగ్ టూల్స్‌ను ఉపయోగించి వ్యాపారాలు వాట్సాప్ బిజినెస్ ఖాతాలను సులభంగా సెటప్ చేసుకునే

# రైల్వే రూపురేఖలే మార్చేశాం

- మోదీ హయాంలో ఆధునికీకరణ వేగవంతమైందన్న అమిత్ షా
- దేశంలో తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలుకు పచ్చజెండా
- రూ.1,472 కోట్ల రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభం
- రైల్వే నెట్‌వర్క్‌లో 99.6 శాతం విద్యుదీకరణ పూర్తి
- 2030 నాటికి డీజిల్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించడమే లక్ష్యం

**అహ్మదాబాద్, సెప్టెంబర్ 27:**



ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారతీయ రైల్వేలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. విద్యుదీకరణ, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం, ఆధునిక రైల్వే వ్యవస్థలు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కుంభకోణాలు, అవినీతి చోటుచేసుకున్నాయని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. తొలి ఎల్ఎన్‌జీ రైలు ప్రారంభం గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్‌లో దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలుకు అమిత్ షా పచ్చజెండా ఊపారు. రూ.1,472 కోట్ల విలువైన వివిధ రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. రూ.700 కోట్లతో నిర్మించిన WAG 12 లోకోమోటివ్ మెయింటెనెన్స్ షెడ్‌ను ప్రారంభించారు. సబర్మతికలోల్‌సబర్మతి సెక్షన్‌లో రూ.48 కోట్లతో 'కవచ్' రక్షణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. అహ్మదాబాద్‌పాలన్‌పూర్, అహ్మదాబాద్‌సమాఖ్యాలి మార్గాల్లో కవచ్ పనులు, సబర్మతిసర్ఖేజ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులను చేపట్టారు. 99.6 శాతం విద్యుదీకరణ దేశంలో రైల్వే విద్యుదీకరణ 99.6 శాతానికి చేరిందని అమిత్ షా తెలిపారు. మిగిలిన 0.4 శాతాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. 201011లో ఏడాదికి 75 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ జరగ్గా, 202324 నాటికి అది 7,188 కిలోమీటర్లకు పెరిగిందని చెప్పారు. రైల్వేలో డీజిల్ వినియోగం 201516లో 293 కోట్ల లీటర్లు ఉండగా, 202425 నాటికి 108 కోట్ల లీటర్లకు తగ్గిందన్నారు. భవిష్యత్తులో డీజిల్‌పై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. 12 వేల హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన WAG12 లోకోమోటివ్ దాదాపు 600 ట్రక్కులకు సమానమైన సరుకును తరలించగలదని షా తెలిపారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, రాపిడ్ రైల్ వ్యవస్థలు, ఆధునిక స్టేషన్ల అభివృద్ధితో రైల్వే సామర్థ్యం పెరుగుతోందన్నారు. ముంబై సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు నుంచి వడోదర వరకు లాంగ్‌హాల్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ విజయవంతమైనట్లు చెప్పారు. సుమారు 11 వేల కిలోమీటర్ల కారిడార్‌ను నాలుగు లైన్ల నెట్‌వర్క్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. గుజరాత్‌కు రైల్వే కేటాయింపులు 200914 మధ్య రూ.589 కోట్లు ఉండగా, 202627లో రూ.17,366 కోట్లకు చేరాయని అమిత్ షా తెలిపారు. కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌పీయూ క్యాంపస్‌లో ఉద్రిక్తత

- • అత్యాచారం, ఆత్మహత్య జరిగిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- • నిరసనకు దిగిన విద్యార్థులు.. క్యాంపస్‌లో ఆస్తుల ధ్వంసం
- * జలంధర్-ఫగ్వారా జాతీయ రహదారిపై బైఠాయింపు
- • అత్యాచారం, ఆత్మహత్యపై ఫిర్యాదు లేదన్న పోలీసులు
- • సోషల్ మీడియా ప్రచారం అవాస్తవమన్న వర్సిటీ యాజమాన్యం

**చండీగఢ్, సెప్టెంబర్ 27:**



పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ) క్యాంపస్‌లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ విద్యార్థినిపై నిర్మాణ కార్మికులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని, అనంతరం ఆమె ఆత్మహత్య చేసుకుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు నిరసనకు దిగారు. అయితే అలాంటి ఘటన జరిగినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదా ఫిర్యాదు అందలేదని పోలీసులు స్పష్టం చేశారు. అదుపుతప్పిన నిరసన క్యాంపస్‌లో గుమిగూడిన విద్యార్థులు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపటికే నిరసన ఉద్రిక్తంగా మారడంతో గాజు కిటికీలు, పూలకుండీలు ధ్వంసమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. అనంతరం విద్యార్థులు జలంధర్‌ఫగ్వారా జాతీయ రహదారిని దిగ్బంధించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఫిర్యాదు రాలేదు: పోలీసులు క్యాంపస్‌లో అత్యాచారం లేదా ఆత్మహత్య జరిగినట్లు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని కపుర్తలా ఎస్ఎస్పీ గౌరవ్ తూరా తెలిపారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఆరోపణలకు ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. విద్యార్థులు, యూనివర్సిటీ యాజమాన్యంతో చర్చించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. క్యాంపస్‌లో జరిగిన ఆస్తి నష్టంపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరోవైపు విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నారని ఎల్‌పీయూ యాజమాన్యం ప్రకటించింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొంటూ సర్క్యులర్ విడుదల చేసింది. విద్యార్థులు నిరసనలకు దూరంగా ఉండాలని, హాస్టల్ గదుల్లోనే ఉండి క్యాంపస్‌లో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు సహకరించాలని సూచించింది

## అస్సాంలో సీజేపీ నేతల అదుపులోకి.. ఉద్రిక్తత

- అస్సాంలో సీజేపీ నేతల అదుపులోకి.. ఉద్రిక్తత
- వాలంటీర్ల సమావేశానికి ముందే అశుతోష్ రాంకా సహా పలువురి నిర్బంధం
- 30 మందికి పైగా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు సీజేపీ వెల్లడి
- రాంకాను విడుదల చేయకుంటే అస్సాం వస్తానన్న అభిజీత్ దీప్కే
- 'అరెస్ట్, జైలు బెదిరింపులకు తలొగ్గం' అంటూ ఎక్స్‌లో పోస్టు
- సమావేశాన్ని అడ్డుకున్నారంటూ సీజేపీ ఆరోపణలు

**గువాహటి, సెప్టెంబర్ 27:**

అస్సాంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించ తలపెట్టిన ప్రాంతీయ వాలంటీర్ల సమావేశానికి ముందే ఆ పార్టీ కో కన్వీనర్ అశుతోష్ రాంకా సహా పలువురు నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 30 మందికి పైగా సీజేపీ సభ్యులను నిర్బంధించినట్లు ఆ పార్టీ తెలిపింది. సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన తమ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారని సీజేపీ ఆరోపించింది.

**దీప్కే అస్సాం పర్యటన**

రాంకాను విడుదల చేయకపోతే తాను సోమవారం అస్సాం వస్తానని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. 'అరెస్ట్ లేదా జైలు బెదిరింపులకు తలొగ్గబోమని, విమానాశ్రయంలోనే తనను అరెస్ట్ చేసుకోవచ్చని' ఎక్స్‌లో పోస్టు చేశారు. రాంకాను ఎలాంటి కేసు, కారణం చెప్పకుండా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు.

**పోలీసుల చర్యపై సీజేపీ ఆరోపణలు**

గువాహటిలోని ఒక ప్రైవేటు ప్రాంగణంలో వాలంటీర్ల సమావేశం నిర్వహించేందుకు సీజేపీ ఏర్పాట్లు చేసింది. అయితే సమావేశానికి వెళ్లకుండా పోలీసులు రహదారులను అడ్డుకున్నారని, అనంతరం తమ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, రాంకా సహా పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు పలు మీడియా సంస్థలు నివేదించాయి. అయితే ఈ పరిణామాలపై తాజాగా రాంకా స్పందిస్తూ తన నిర్బంధం ముగిసిందని తెలిపారు. పోలీసులు తనను, ఇతరులను వారు తీసుకెళ్లిన ప్రదేశానికి తిరిగి తీసుకువెళ్లారని చెప్పారు.

## 30 రోజుల రీచార్జ్ లకు గ్రీన్‌సిగ్నల్

- 28 రోజుల ప్లాన్లకు బదులుగా 30 రోజుల వ్యాలిడిటీకి అవకాశం
- వాయిస్, ఎస్ఎంఎస్-ఓన్లీ ప్లాన్లు తప్పనిసరి చేసిన ట్రాయ్
- డేటా అవసరం లేని వినియోగదారులకు ప్రత్యేక రీచార్జ్‌లు
- ఏడాదిలో 13 రీచార్జ్‌లకు బదులు 12కి తగ్గే అవకాశం
- నిర్ణయాన్ని స్వాగతించిన రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:**

మొబైల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు ఉపయోగపడేలా టెలికాం రీచార్జ్ ప్లాన్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. వాయిస్, ఎస్ఎంఎస్, డేటా కలిపిన ప్లాన్లకు అందించే ప్రతి వ్యాలిడిటీకి అనుగుణంగా వాయిస్, ఎస్ఎంఎస్‌ఓన్లీ స్పెషల్ టారిఫ్ వోచర్లు (ఎస్టీవీలు) అందించాలని టెలికాం సంస్థలను ట్రాయ్ ఆదేశించింది. 2026 సెప్టెంబర్ 22న 'టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్స్'ను ట్రాయ్ విడుదల చేసింది.

**తక్కువ బడ్జెట్ వినియోగదారులకు ప్రయోజనం**

టెలికాం రీచార్జ్‌లలో వచ్చిన ఈ మార్పులను రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా స్వాగతించారు. 28 రోజుల వ్యాలిడిటీని నెలవారీ ప్లాన్‌గా పరిగణించడం వల్ల వినియోగదారులు ఏడాదిలో 13 సార్లు రీచార్జ్ చేయాల్సి వస్తోందని ఆయన గతంలో ప్రస్తావించారు. 30 రోజుల వ్యాలిడిటీ ఉన్న ప్లాన్లు అందుబాటులోకి వస్తే ఏడాదికి 12 సార్లు రీచార్జ్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**డేటా అవసరం లేనివారికి ప్రత్యేక ప్లాన్లు**

డేటా వినియోగించని వారికి వాయిస్, ఎస్ఎంఎస్ మాత్రమే ఉండే ప్లాన్లను అందించాలన్నది తాజా నిబంధనల్లో కీలక అంశం. వాయిస్, ఎస్ఎంఎస్, డేటా కలిపిన ప్రతి ప్రత్యేక వ్యాలిడిటీకి అనుగుణంగా వాయిస్, ఎస్ఎంఎస్‌ఓన్లీ ఎస్టీవీని కూడా అందించాలని ట్రాయ్ స్పష్టం చేసింది. ఈ నిబంధనకు సంబంధించి 2026 ఏప్రిల్‌లో విడుదల చేసిన ముసాయిదాలోనూ ఇదే విధానాన్ని ప్రతిపాదించింది. దీంతో ప్రధానంగా డేటా అవసరం లేకుండా ఫోన్‌ను కాల్స్, ఎస్ఎంఎస్‌ల కోసం మాత్రమే ఉపయోగించే వినియోగదారులకు తమ అవసరానికి తగ్గ ప్లాన్లను ఎంచుకునే అవకాశం ఏర్పడనుంది.

# ఆర్టీఐ పరిధి నుంచి శాంతిభద్రతల విభాగం మినహాయింపు

- - గెజిట్ ఉత్తర్వులు జారీ చేసిన తమిళనాడు ప్రభుత్వం
- - గూఢచార, భద్రతా సంస్థగా వర్గీకరణ
- - పారదర్శకతపై వ్యక్తమవుతున్న ఆందోళనలు
- - రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసిన నిర్ణయం

**చెన్నై, సెప్టెంబర్ 27 :**

రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకమైన శాంతిభద్రతల విభాగాన్ని సమాచార హక్కు చట్టం పరిధి నుంచి మినహాయిస్తూ తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గూఢచార, భద్రతా సంస్థల జాబితాలో ఈ విభాగాన్ని చేర్చుతూ ప్రభుత్వం గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ శాఖకు సంబంధించిన అనేక అంశాలపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు పొందే అవకాశాలు పరిమితమవుతాయని భావిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం మానవ వనరుల నిర్వహణ శాఖ ద్వారా విడుదల చేసిన ఉత్తర్వుల్లో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 24(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలను వినియోగించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ నిబంధన ప్రకారం గూఢచార, భద్రతా కార్యకలాపాలు నిర్వహించే సంస్థలను సమాచార హక్కు చట్టం పరిధి నుంచి మినహాయించే అవకాశం రాష్ట్రాలకు ఉంటుంది. అదే అధికారాన్ని ఉపయోగించి శాంతిభద్రతల విభాగాన్ని ప్రత్యేక జాబితాలో చేర్చినట్లు వెల్లడించింది.

రాష్ట్రంలో మత ఘర్షణలు, సామాజిక ఉద్రిక్తతలు, రాజకీయ ఆందోళనలు, నిరసనలు,



శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం తీసుకునే అనేక నిర్ణయాలు ఈ శాఖ ద్వారా అమలవుతుంటాయి. తాజా నిర్ణయంతో ఈ విభాగానికి సంబంధించిన సమాచారాన్ని పొందడంలో పరిమితులు ఏర్పడే అవకాశముందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నిర్ణయంపై పౌరసంఘాలు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టుల వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రజలకు సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, ఇలాంటి నిర్ణయాలు పారదర్శకతపై ప్రభావం చూపవచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజా పర్యవేక్షణ తగ్గే ప్రమాదం ఉందని కూడా వారు పేర్కొంటున్నారు.

మరోవైపు భద్రతా వ్యవహారాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని రక్షించేందుకు ఇలాంటి చర్యలు అవసరమని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా కొన్ని వివరాలు బహిర్గతం కాకుండా ఉండటం అవసరమని వారు వాదిస్తున్నారు. భద్రతా అంశాలు ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవని చెబుతున్నారు. అయితే సమాచార హక్కు చట్టంలోని నిబంధనల ప్రకారం అవినీతి ఆరోపణలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలు ప్రత్యేక పరిస్థితుల్లో పరిశీలనకు అవకాశం ఉండే విషయాన్ని నిపుణులు గుర్తుచేస్తున్నారు. మొత్తంగా తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పారదర్శకత, జవాబుదారీతనం, భద్రత అంశాలపై విస్తృత చర్చకు దారితీసింది.

## అంబేద్కర్ నగర్ గణేశ్ లడ్డూకు రూ.1.87 లక్షలు



- రాధాకృష్ణ దంపతులకు తొలి లడ్డూ.. రెండోది రూ.86 వేలు, మూడోది రూ.65 వేలు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట అంగరంగ వైభవంగా జరిగింది. అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో మొదటి గణేష్ లడ్డూను రాధాకృష్ణ దంపతులు రూ.1,87,000/- లకు కైవసం చేసుకున్నారు. రెండవ లడ్డూను మేకల నరేందర్ దంపతులు రూ.86,000/- లకు, మూడవ లడ్డూను ఉప్పరి వినోద్ కుమార్ దంపతులు రూ.65,000/- లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమం లో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొని భక్తిశ్రద్ధలతో గణపతిని దర్శించుకున్నా రు. లడ్డూను కైవసం చేసుకున్న దంపతులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

## భరత్ నగర్ అసోసియేషన్ వార్షికోత్సవం



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :**

భరత్ నగర్ కాలనీ అసోసియేషన్ ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అసోసియేషన్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి తో పాటు సభ్యులను ఘనంగా సత్కరించి, మొమెంటోలు అందజేశారు. కార్యక్రమం లో బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కూకట్పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బి సంజీవరావు, సీనియర్ నాయకుడు కొండల్ రెడ్డి, అశోక్ ముదిరాజ్, సంతోష్, శ్రీధర్ చారి, వనజ, స్వాతి, దీప్తి, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## విశ్వజ్ఞ బ్రహ్మ స్వర్ణకారుల కార్యవర్గం



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

కామారెడ్డి పట్టణ విశ్వాజ్ఞ బ్రహ్మ స్వర్ణ సంఘం అధ్యక్షులుగా చేపూరి వెంకట స్వామి చారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వజ్ఞ చేపూరి వెంకటస్వామి చారి మాట్లాడుతూ విశ్వజ్ఞ బ్రహ్మ స్వర్ణ సంఘం అధ్యక్షులుగా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం ,పట్టణ స్వర్ణకార సంఘం ,సువర్ణ కళాకారుల సంఘం యువజన సంఘం సభ్యులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నాపై నమ్మకంతో అధ్యక్షులుగా చేసినందుకు నా వంతుగా కృషి చేస్తానని నాకు తోడుగా మీరు కూడా అందరూ ఉండాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి ఉపేష్ చారి, కోశాధికారి పిర్కోజి శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షులు కనకంటి వంగల దుర్గాప్రసాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాశ్వత గౌరవ అధ్యక్షులు ఉగ్రవాయి రాఘవుల చారి, శాశ్వత గౌరవ సలహాదారులు వంగాల శ్రీనివాస్ చారి, గౌరవ సలహాదారులు వంగాల పుండరీక చారి, కె లక్ష్మయ్య, వంగాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## రంగంపేట్ పాఠశాలలో ఉల్లాస్ పరీక్షలు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా రంగంపేట్ గ్రామ పరిధిలోని పాఠశాలలో ఉల్లాస్ ఐకెపి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించడం జరిగినది.ఈ పరీక్ష కేంద్రానికి జిల్లా ఆఫీస్ నుండి ఏపీఎం రాజేందర్ వచ్చి పర్యవేక్షించడం జరిగింది, సి సి అబ్బ లింగం ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించడం జరిగింది . ఈ ఉల్లాస్ పరీక్ష రాయడానికి 25 మంది సభ్యులు హాజరు కావడం జరిగింది, అలాగే వివో ఏలు మమత , గ్రామ సంఘం అధ్యక్షులు స్వప్న , గ్రామ సర్పంచ్ సాలెహా సుల్తానా తదితరులు పాల్గొని పరీక్షల నిర్వహణలో పాల్గొన్నారు.

# క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- యువ శౌర్య సేన ప్రతినిధులకు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సన్మానం



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్ :**

శంకర్ పల్లి డివిఎమ్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో శంకర్ పల్లికి చెందిన యువ శౌర్య సేన ప్రతినిధులకు ఆదివారం చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఘన సన్మానం జరిగింది. ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మహా కరాటే ప్రదర్శనలో సుమారు 2,500 మంది పాల్గొనగా, వారిలో 1,212 మంది గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో శంకర్ పల్లికి చెందిన యువ శౌర్య సేనకు 18 గిన్నిస్ వరల్డ్ రికార్డులు లభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువ శౌర్య సేన వ్యవస్థాపకులు, అధ్యక్షులు రవీందర్ లంటూ యాదవ్, చేవెళ్ల సుశ్రుత్ రెడ్డిలను ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మెడల్, సర్టిఫికెట్, శాలువాతో ఘనంగా సత్కరించారు. యువ శౌర్య సేన సాధించిన గిన్నిస్ వరల్డ్ రికార్డులను అభినందిస్తూ ఎంపి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

**యువత క్రీడల్లో రాణించాలి...**

ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... యువత క్రీడలు, మార్షల్ ఆర్ట్స్పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చన్నారు. శంకర్ పల్లి ప్రాంతానికి చెందిన యువత గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించడం అభినందనీయమని, యువ శౌర్య సేన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుండాలని ఆయన సూచించారు.

**యువతను ప్రోత్సహించడమే లక్ష్యం...**

యువ శౌర్య సేన అధ్యక్షులు రవీందర్ యాదవ్ లంటూ మాట్లాడుతూ..యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన వేదిక కల్పించడమే యువ శౌర్య సేన ప్రధాన లక్ష్యమన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మహా కరాటే ప్రదర్శనలో తమ సంస్థకు చెందిన పలువురు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తమ సంస్థకు 18 గిన్నిస్ వరల్డ్ రికార్డులు రావడం వెనుక క్రీడాకారుల కృషి, శిక్షకుల మార్గదర్శకత్వం, సహకరించిన ప్రతి ఒక్కరి ప్రోత్సాహం ఉందన్నారు. భవిష్యత్తులో కూడా యువత కోసం క్రీడా, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా నాయకులు రాజగోపాల్ గౌడ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షులు చెందిప్ప దయాకర్ రెడ్డి, సేవా సంకల్ప్ అభియాన్ కన్వీనర్ బీర్ల సురేష్, మాజీ మున్సిపల్ అధ్యక్షులు, కో-కన్వీనర్ స్రవంతి గౌడ్, కో-కన్వీనర్ ఆర్. వెంకట్రాంరెడ్డి, రాములు గౌడ్, జయరాం రెడ్డి, మిర్జాగూడ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణగిరి పాదాలగుట్టకు భక్తుల తాకిడి

- పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ.. ప్రత్యేక పూజలు, భజనలు
- పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న నరేశ్ కుమార్ కు సన్మానం





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

సనాతన విశిష్టతను సంతరించుకున్న గుబ్బడి పత్తేపురం గ్రామంలోని క్రిష్ణగిరి పాదాల గుట్టకు పలు ప్రాంతాల నుంచి భక్తుల తాకిడి ఎక్కువ అవుతుంది. పౌర్ణమి సందర్భంగా శనివారం సాయంత్రం వరకు శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రంలో అభిషేక పూజలు, పాదాల దర్శనాలు, భజనలతో మారుమోగిపోయింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన గోమాత సహిత శ్రీ రాధాకృష్ణ విగ్రహానికి, అలాగే గుట్టపై ఉన్న కృష్ణ పాదాలకు భక్తుల అభిషేక పూజలు చేశారు. మోమిన్ పేట మండలం వెంకతల గ్రామానికి చెందిన మహిళల బృందం భక్తులు రాధాకృష్ణ ఆలయ క్షేత్రంలో భజన చేయడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. అనంతరం నగరానికి చెందిన సనాతన ధర్మం, హైందవ జాతి ప్రచారకర్త లాయర్ బి గిరిధర్, ఆయన సతీమణి రమ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లాయర్ బి గిరిధర్, బ్లూ స్కూమ్ బేబీ డే కేర్ అండ్ ప్లే స్కూల్ ప్రిన్సిపల్ బి సరితలు మాట్లాడుతూ... పచ్చని పంట పొలాల మధ్య ఉన్న ఈ పురాతన క్రిష్ణగిరి గుట్ట ఎంతో బాగుందన్నారు. క్రిష్ణగిరి పాదాలగుట్ట తిరిగి మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడానికి నరేష్ కుమార్ కర్త, కర్మ, క్రియ కావడం ఆయన పూర్వజన్మ సుకృతం అన్నారు. అటూ చందీప్ప మరకత శివలింగ నామకరణ భక్తునిగా, ఇటు రాధాకృష్ణ ఆలయ క్షేత్రం అభివృద్ధికి నరేష్ కుమార్ చేస్తున్న సేవలు అమోఘమని, గ్రామస్తులు కూడా ఇలాగే అండగా ఉంటే గొప్ప క్షేత్రంగా మారుతుందన్నారు. ఈ ఊరికి తాము రావడానికి నరేష్ కుమార్ కారణమని, దేవుడు ఒక్కోచోట ఒక్కొక్కరిని ఎంచుకుంటాడని అలాగే ఎన్నో గుడులకు ప్రచారం చేస్తూ చందిప్ప గుడి మాదిరిగా ఈ క్రిష్ణగిరి పాదాల గుట్టకు కూడా నరేష్ ని ఎంచుకోవడం దైవానుగ్రహం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ కు పూలమాలవేసి, శాలవాతో సత్కరించడం జరిగింది. అనంతరం భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ... ప్రతి యువకుడు ఓ చత్రపతి శివాజీ లాగా మన భారతదేశం హైందవ జాతికి తల మాణికం అవుతుందన్నారు. ఆ విధంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేసిన గ్రామ పెద్దలు. రావులపల్లి రాజు దంపతులను, ఎన్కతల మహిళా భజన బృందం నరేష్ కుమార్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రావులపల్లి రామ లక్ష్మయ్య, జంగయ్య ముదిరాజ్, రావులపల్లి జంగయ్య, హరి, శ్రీశైలం గౌడ్, వెంకటేష్ గౌడ్, రాములు గౌడ్, శ్రీనివాస్, చరణ్, వినయ్, శ్రీనివాస్, ప్రశాంత్, విద్యార్థులు సాయి శృతి, వైష్ణవి, శంకర్ పల్లికి చెందిన మాణిక్యం, మహిళలు, గ్రామస్తులు, పూజారి ఆదిత్య, అశోక్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ ఎన్. వై. గిరి



**కామారెడ్డి , రాజముద్ర న్యూస్:**

కామారెడ్డి పట్టణంలోని సి.ఎస్. చర్చి ఎదుట ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా నాయకుడిగా ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోదావరి స్వామి, బీసీ వెల్ఫేర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. బహుజన సమాజ నేతలు కొత్తపల్లి మల్లయ్య, క్యాతం సిద్దిరాములు, బీసీ సంఘ నాయకులు శివరాములు, శంకర్, రాజయ్య, నాగరాజు, శ్రీనివాస్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు సరిగాద లక్ష్మీ నర్సయ్య, పట్టణ అధ్యక్షులు సబ్బని కృష్ణ హరి, స్వామి, రాజయ్య, నర్సయ్య, చక్రధర్, నరేష్, పవన్, సునీత, స్వామి, విజయశాంతి, కృష్ణ ప్రసాద్, శాంతయ్య, శ్రీకర్ తదితరులు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించారు.

## మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్ మెంట్ జనరల్ సెక్రటరీగా సయ్యద్ షఫీ

**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్ :**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీగా సయ్యద్ షఫీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సయ్యద్ షఫీ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి సయ్యద్ షఫీని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యని శివ, కుత్బుల్లాపూర్ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ ఖైమ్ పాషా, డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, జలీల్ ఖాన్, డివిజన్ మైనారిటీ అధ్యక్షులు ఎం.డి. షకీల్, ఎం.డి. ఫెరోజ్, షేక్ షరీఫ్, ఎం.డి. జబ్బర్, ఎం.డి. యాసీమ్, ఖయీమ్, అఫాన్, గౌస్ భాయ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్యామ్, హన్మి రెడ్డి తదితర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



# హైదర్ నగర్ లో లడ్డూ వేలం

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :**



హైదర్ నగర్ లో అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక లడ్డూ వేలం ఉత్సాహంగా సాగింది. ఈ వేలంలో మొదటి లడ్డూను కుంట నరేష్ రూ.72,000లకు దక్కించుకున్నారు. అనంతరం రెండవ లడ్డూను సదా మనీష్ రూ.72,016లకు పాట పాడి సొంతం చేసుకున్నారు. వేలం కార్యక్రమంలో స్థానికులు, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, తమకు విద్యాబోధన చేసిన గురువులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ తమ కుటుంబ, ఉద్యోగ, ఇతర విషయాలను తెలుసుకున్నారు. పాత స్నేహితులను, గురువులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థులు తెలిపారు. పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కొంత సమయం ఆనందంగా గడిపారు.

# క్యాన్సర్ చికిత్సలో ఆధునిక సాంకేతికత కీలకం



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

క్యాన్సర్ చికిత్సలో ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ), వైద్య భౌతిక శాస్త్రం కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు తెలిపారు. కిమ్స్ ఆసుపత్రుల సికింద్రాబాద్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డా. టి.ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ మెడికల్ ఫిజిసిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ వార్షిక సదస్సును ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.కుమార్ మొలుగారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధునాతన భౌతిక శాస్త్రం, కృత్రిమ మేధ, ప్రజారోగ్య మౌలిక వసతులను సమన్వయం చేయడం ద్వారా నాణ్యమైన వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించవచ్చని తెలిపారు. రేడియేషన్ డోసిమెట్రీ, న్యూక్లియర్ మెడిసిన్, రేడియేషన్ భద్రత, ఆధునిక క్యాన్సర్ చికిత్స విధానాలపై సదస్సులో నిపుణులు చర్చించారు. అత్యాధునిక వసతులతో చికిత్స: కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఎండీ డా. బి.భాస్కర్‌రావు మాట్లాడుతూ.. క్యాన్సర్‌కు వివిధ రకాల చికిత్సలు అందించేందుకు కిమ్స్‌లో అత్యాధునిక సాంకేతిక మౌలిక వసతులు, నిపుణులైన వైద్య బృందం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కిమ్స్ సికింద్రాబా ద్ రేడియేషన్ ఆంకాలజీ విభాగం ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తింపు పొందిన పరిశోధనా కేంద్రంగా కొనసాగుతోందని ప్రొఫెసర్ ఎం.కుమార్ మొలుగారం తెలి పారు. మెడికల్ ఫిజిక్స్‌లో పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా కోర్సు నిర్వహణకు కిమ్స్, ఉస్మానియా విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం ఉందన్నారు. కార్యక్ర మంలో కిమ్స్ హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డా. సాంబిత్ సాహు, చీఫ్ మెడికల్ ఫిజిసిస్ట్, సీనియర్ మెడికల్ ఫిజిసిస్ట్ డా. పీబీఎల్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కసరత్తు



**కరీంనగర్, రాజముద్ర న్యూస్:**

కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవనాన్ని ఈ నెల 30న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. సీఎం పర్యటనను పురస్కరించుకుని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదివారం జిల్లా యంత్రాంగంతో కలిసి నూతన కలెక్టరేట్ ప్రాంగణాన్ని సందర్శించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలు, వాహనాల పార్కింగ్ వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రారంభోత్సవ సమయానికి కలెక్టరేట్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈలు వెంకటేశ్వర్లు, దేవేందర్‌రెడ్డి, ఏఈలు, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ పల్లిలో రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్..

- మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- డయల్ -112 సేవలను సద్వినియోగం చేసుకోవాలి: సీఐ రుద్వీర్ కుమార్






**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ఆదేశాల మేరకు శంకర్ పల్లిలోని సిటిజన్ ప్యాలెస్‌లో నిర్వహించిన 14వ రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ సందర్భంగా శంకర్ పల్లి పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రుద్వీర్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి డయల్–112 అత్యవసర సేవల ప్రాముఖ్యత, మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఇతర సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద లేదా ప్రమాదకర పరిస్థితి ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే అనుమానాస్పద లింకులు, నకిలీ ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–112 సేవలను సద్వినియోగం చేసుకోవాలని, డిజిటల్ వేదికలను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. విద్యార్థులు, యువత, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఇటువంటి అవగాహనా కార్యక్రమాలను కొనసాగిస్తామని శంకర్ పల్లి పోలీసులు తెలిపారు.





# సుజాత యాదవ్ సేవలు చిరస్మరణీయం

- ఆత్మకు శాంతి చేకూరాలని ఘన నివాళి
- పెద్దలకు బియ్యం అందజేత.. ఆలయంలో గంట ఏర్పాటు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ చైర్ పర్సన్ కీ.శే. రాగం సుజాత యాదవ్ ఆత్మకు శాంతి చేకూరాలని నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. నల్లగండ్లలోని వర్టెక్స్ కింగ్ స్టన్ పార్క్ విల్లాస్ క్లబ్ హౌస్ లో వారి జ్ఞాపకార్థం పెద్దలకు బియ్యం ఇవ్వడం, దేవాలయంలో గంట కట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రముఖ వ్యాపారవేత్తలు, శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల సీనియర్ నాయకులు, పుర ప్రముఖులు, శేరిలింగంపల్లి జర్నలిస్టు మిత్రులు, వేలాది మంది ప్రజలు హాజరై నివాళులర్పించారు. ముందుగా కీ.శే. సుజాత యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ, మే 9, 1996 నుండి 30 ఏళ్లకు పైగా ప్రజా సేవలో తనకు తోడుగా నిలిచిన సుజాత లేకపోవడం తీరని లోటని, ఆమె కౌన్సిలర్ గా (2000–2005), రెండుసార్లు సాంఘిక సంక్షేమ బోర్డు చైర్ పర్సన్ గా మహిళల కోసం కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన గొప్ప సేవామూర్తి అని కొనియాడారు."నువ్వు లేని లోటు మాటల్లో చెప్పలేను.. నీ జ్ఞాపకాలతోనే ఇక నా మిగిలిన ప్రయాణం.. మీ కోరిక మేరకు నా జీవితం ప్రజా సేవకే అంకితం" అని రాగం నాగేందర్ యాదవ్ భావోద్వేగంతో అన్నారు. మన సంప్రదాయం ప్రకారం పెద్దలకు బియ్యం ఇవ్వడం, గుడిలో గంట కట్టడం ద్వారా వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని తెలిపారు. అనంతరం విచ్చేసిన వారందరికీ భోజనం ఏర్పాటు చేశారు. తమ ఆత్మీయురాలికి నివాళులర్పించి, తమ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

# నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

- టీపీఎస్ ల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యపై నమ్మకం పెరుగుతోంది:
- మంత్రి శ్రీధర్ బాబు
- ఎస్టీయూ టీఎస్ 80 వసంతాల వైభవోత్సవంలో పాల్గొన్న మంత్రి



**హైదరాబాద్/నాగోల్, రాజముద్ర న్యూస్:**

తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆరుట్ల పాఠశాల ఎదుట 'నో అడ్మిషన్' బోర్డులు ఏర్పాటు చేయడం ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ ఆధ్వర్యంలో ఎస్టీయూ టీఎస్ 80 వసంతాల వైభవోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

**హక్కుల సాధనలో విశ్రమించం**

ఎందరో ఉపాధ్యాయ నేతల త్యాగాల ఫలితంగానే నేడు అనేక ప్రయోజనాలు, హక్కులు లభించాయని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ అన్నారు. వారి ఆశయాల సాధనకు కృషి చేయడమే వారికి ఇచ్చే నివాళి అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఎస్టీయూ మరింత చేరువై ఐక్య ఉద్యమాలకు నాయకత్వం వహిస్తోందన్నారు. ఇటీవల రెండు విడతల డీఏ బకాయిలను సాధించుకున్నామని, పీఆర్సీ సాధన కోసం కూడా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

**జేఏసీ పోరాటం కొనసాగుతుంది**

ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించే వరకు జేఏసీ పోరాటం కొనసాగుతుందని చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ అన్నారు. గతంలో ముఖ్యమంత్రితో మాట్లాడే పరిస్థితి ఉండేది కాదని, ప్రస్తుతం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వింటోందని పేర్కొన్నారు. నిరసనలు తెలిపే స్వేచ్ఛ కూడా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎస్టీయూ పూర్వ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సాబేర్ అలీ, ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి, ఏపీ, తెలంగాణ ఎస్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందం

- సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో బీఆర్ఎస్ నేతల్లో ఉలికిపాటు
- కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి




**కరీంనగర్, రాజముద్ర న్యూస్:**

ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో చేపట్టనున్న పర్యటన కార్యకర్తలు, ప్రజల్లో ఉత్సాహం నింపుతుందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.60 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనాన్ని సీఎం ప్రారంభించడంతోపాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. సుడా నిధులతో కలెక్టరేట్ ఉత్తరం వైపు నుంచి ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.కోటి, హెలిప్యాడ్ నిర్మాణానికి రూ.65 లక్షలు, గార్డెన్లు, సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.కోటి, పాత భవనం ఫేస్‌లిఫ్ట్‌కు రూ.30 లక్షలు వెచ్చించినట్లు నరేందర్‌రెడ్డి వివరించారు.

**దాడుల సంస్కృతి మంచిది కాదు**

బీజేపీ నాయకులకు డ్రామాలు, దాడులు నిత్యకృత్యంగా మారాయని నరేందర్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల నీటి విడుదల విషయంలో ఆందోళన చేశారని, చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దాడుల సంస్కృతి మంచిది కాదని, ఇప్పటివరకు ఓపిక పట్టామని.. ఇక చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేబుల్ బ్రిడ్జిపై లైట్లు వెలగకపోవడానికి గతంలో లోపభూయిష్టంగా చేపట్టిన టెండర్ ప్రక్రియే కారణమని ఆరోపించారు. ఆర్ఓబీ నిర్మాణం ఆలస్యానికి మూడేళ్ల తర్వాత మెయిన్ పియర్స్ డిజైన్లు ఇవ్వడం కారణమన్నారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందం ఉందని, అందుకే రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకోవడం లేదని నరేందర్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలపై చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆయన పర్యటన అనగానే ఆ పార్టీ నేతల్లో ఉలికిపాటు కనిపిస్తోందని నరేందర్‌రెడ్డి అన్నారు. "ఇన్నిరోజులు ఒక లెక్క.. ఇప్పటినుంచి ఒక లెక్క.. కాస్కో కేటీఆర్" అంటూ వ్యాఖ్యానించారు. సమావేశంలో కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, జగన్‌రెడ్డి, నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, షబానా మహమ్మద్, ఆస్తపురం తిరుమల, జ్యోతి రెడ్డి, భారతి, కీర్తికుమార్, అంజయ్య, మామిడి సత్యనారాయణరెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# వెస్టిండీస్ ఓపెనర్ గ్రీవ్స్ సెంచరీ.. టీమిండియా ముందు భారీ టార్గెట్

- తొలి వన్డేలో భారత్‌కు 296 పరుగుల లక్ష్యం నిర్దేశించిన వెస్టిండీస్
- సెంచరీతో కదం తొక్కిన ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ (101)
- మరో ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ (62), చివర్లో అమీర్ జంగూ (58*) హాఫ్ సెంచరీలు
- టీమిండియా బౌలర్లలో నాలుగు వికెట్లతో సత్తా చాటిన కుల్దీప్ యాదవ్
- భారీ భాగస్వామ్యం తర్వాత దెబ్బతిన్నా.. చివర్లో పుంజుకున్న విండీస్

**స్పోర్ట్స్ డెస్క్ :**

వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి వన్డేలో టీమిండియా ముందు భారీ లక్ష్యం నిలిచింది. తిరువనంతపురం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్, నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 295 పరుగుల స్కోరు సాధించింది. ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ (101) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (4/40) నాలుగు వికెట్లతో విండీస్‌ను కట్టడి చేశాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయం సరైంది కాదేమో అన్నట్లుగా విండీస్ ఓపెనర్లు జాన్ క్యాంప్‌బెల్ (62), జస్టిన్ గ్రీవ్స్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 135 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో క్యాంప్‌బెల్ దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని కుల్దీప్ యాదవ్ విడదీశాడు. క్యాంప్‌బెల్‌ను ఔట్ చేసి భారత్‌కు తొలి వికెట్ అందించాడు. ఆ తర్వాత తన స్పిన్ మాయాజాలంతో విండీస్ మిడిలార్డర్‌ను దెబ్బతీశాడు. కెప్టెన్ షాయ్ హోప్ (12), సెంచరీ హీరో జస్టిన్ గ్రీవ్స్, జ్యువెల్ ఆండ్రూ (0)లను స్వల్ప వ్యవధిలో పెవిలియన్ పంపాడు. దీంతో, 176/2 స్కోరుతో పటిష్ఠంగా ఉన్న విండీస్.. కుల్దీప్ విజృంభణతో 198/5కి చేరింది. ఒక దశలో విండీస్ 250 పరుగులు కూడా చేయలేదనిపించినా.. చివర్లో అమీర్ జంగూ (58 నాటౌట్) అద్భుతంగా ఆడాడు. కేవలం 43 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయ హాఫ్ సెంచరీ సాధించి జట్టు స్కోరును 295 పరుగులకు చేర్చాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 4 వికెట్లు తీయగా, ప్రసిద్ధ్ కృష్ణ 2, నితీశ్ రెడ్డి ఒక వికెట్ పడగొట్టారు.



# ఆసియా క్రీడల్లో ముగిసిన సింధు పోరాటం..
# చైనా షట్లర్ చేతిలో ఓటమి

- క్వార్టర్ ఫైనల్‌లో ఓటమిపాలైన స్టార్ షట్లర్ పీవీ సింధు
- పురుషుల టీమ్ ఈవెంట్‌లో లభించిన కాంస్యంతోనే సరిపెట్టుకున్న భారత్
- వ్యక్తిగత విభాగాల్లో పతకం లేకుండానే ముగిసిన భారత బ్యాడ్మింటన్ ప్రస్థానం
- డిఫెండింగ్ ఛాంపియన్లు సాత్విక్-చిరాగ్ జోడీ ముందస్తు నిష్క్రమణతో తీవ్ర నిరాశ
- 2014 తర్వాత వ్యక్తిగత ఈవెంట్లలో భారత్‌కు పతకం లేకపోవడం ఇదే తొలిసారి




**స్పోర్ట్స్ డెస్క్ :**

ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత పతక ఆశలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్‌లో పోరాడి ఓటమి పాలవ్వడంతో వ్యక్తిగత విభాగాల్లో భారత్ ప్రస్థానం ముగిసింది. చైనా క్రీడాకారిణి చెన్ యుఫీతో జరిగిన హోరాహోరీ పోరులో సింధు 2111, 1821, 1021 తేడాతో పరాజయం చవిచూసింది. తొలి గేమ్ గెలిచి ఆశలు రేకెత్తించినా, ఆ తర్వాత ఆధిక్యాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ముఖ్యంగా చివరి గేమ్ లో ప్రత్యర్థి జోరు ముందు సింధు నిలవలేకపోయింది.

ఈ ఓటమితో ఐచీ నగోయా ఆసియా క్రీడలు 2026లో భారత బ్యాడ్మింటన్ ప్రస్థానం నిరాశజనకంగా ముగిసింది. ఈ క్రీడల్లో భారత్ కేవలం ఒక్క కాంస్య పతకంతోనే సరిపెట్టుకుంది. పురుషుల టీమ్ ఈవెంట్‌లో లభించిన ఈ కాంస్యమే ఈసారి ఏకైక పతకంగా మిగిలింది. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ సహా ఏ ఒక్క వ్యక్తిగత విభాగంలోనూ భారత షట్లర్లు పతకం సాధించలేకపోయారు.

సింధుతో పాటు యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా కూడా క్వార్టర్స్‌లో ఓటమి పాలైంది. జపాన్‌కు చెందిన అకానే యమగూచితో జరిగిన మ్యాచ్‌లో ఉన్నతి ఓడింది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జోలీగాయత్రి గోపీచంద్ జోడీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టోధ్రువ్ కపిల జంట కూడా క్వార్టర్ ఫైనల్స్‌లోనే తమ పోరాటాన్ని ముగించాయి.

ఈ టోర్నీలో భారత్‌కు అతిపెద్ద షాక్ డిఫెండింగ్ ఛాంపియన్లు సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డిచిరాగ్ శెట్టి రూపంలో తగిలింది. పురుషుల డబుల్స్‌లో స్వర్ణ పతక ఫేవరెట్లుగా బరిలోకి దిగిన ఈ జోడీ, రౌండ్ ఆఫ్ 32లోనే థాయ్‌లాండ్ జంట చేతిలో అనూహ్యంగా ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లోనూ లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి వంటి ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరకముందే నిష్క్రమించారు.

2014 ఇంచియాన్ ఆసియా క్రీడల తర్వాత వ్యక్తిగత విభాగాల్లో భారత షట్లర్లు పతకం సాధించడంలో విఫలమవడం ఇదే తొలిసారి. గతంలో 2023 హాంగ్‌జౌలో మూడు పతకాలు సాధించిన భారత్, ఈసారి కేవలం ఒక్క కాంస్యంతోనే వెనుదిరగడం క్రీడాభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

# చివరి వరల్డ్ కప్.. ఫైనల్‌పై ఓ కల.. తీరని కోరికను బయటపెట్టిన కోహ్లీ

- 2027 వన్డే ప్రపంచకప్ తనకు చివరిదన్న విరాట్
- ఫైనల్లో ఛేజింగ్ చేస్తూ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాలన్నదే తన కల అని వెల్లడి
- వ్యక్తిగత ప్రదర్శన కంటే జట్టు గెలుపే ముఖ్యమని తెలిపిన కోహ్లీ
- 2023 ఫైనల్ ఓటమి నేపథ్యంలో ఈసారి కప్ గెలవాలన్నదే ప్రేరణ అని వ్యాఖ్య




**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత స్టార్ క్రికెటర్, పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ తన కెరీర్‌కు సంబంధించి ఒక కీలక ప్రకటన చేశాడు. 2027లో జరగబోయే వన్డే ప్రపంచకప్పే తనకు చివరిదని స్పష్టం చేశాడు. ఆ టోర్నీ ఫైనల్‌కు సంబంధించి తనకున్న ఒక పెద్ద కలను కూడా అభిమానులతో పంచుకున్నాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతూ కోహ్లీ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు.

"నాకు ఇదే చివరి ప్రపంచకప్. నా సర్వశక్తులు ఒడ్డి ఆడటానికి ఇదే నాకు అతిపెద్ద ప్రేరణ. ఎలాగైనా కప్ గెలవడమే మా లక్ష్యం. దాని కోసం ఏం చేయడానికైనా నేను సిద్ధంగా ఉన్నాను" అని కోహ్లీ చెప్పాడు.

తన చిరకాల కలను వివరిస్తూ, "ఫైనల్లో ఛేజింగ్ చేస్తూ మ్యాచ్‌ను గెలిపించే ఇన్నింగ్స్ ఆడాలన్నది నా కల. అది జరిగితే అద్భుతం. ఒకవేళ అలా జరగకపోయినా, మనం కప్ గెలిస్తే అంతే సంతోషిస్తాను" అని తన మనసులో మాటను బయటపెట్టాడు. వ్యక్తిగత ప్రదర్శన కంటే జట్టు గెలుపే తనకు ముఖ్యమని కోహ్లీ మాటల్లో స్పష్టమైంది.

2023 ప్రపంచకప్ ఫైనల్లో ఓటమి తర్వాత, జట్టులో ఒక అసంపూర్ణమైన లక్ష్యం మిగిలిపోయిందనే భావన ఉందని కోహ్లీ పరోక్షంగా చెప్పాడు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో కేవలం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టిసారించిన కోహ్లీ, 50 ఓవర్ల ప్రపంచకప్ తీవ్రతను ప్రత్యేకంగా ప్రస్తావించాడు. విదేశీ గడ్డపై టీ20 స్థాయి ఉత్కంఠతను ఎక్కువ మ్యాచ్‌లలో కొనసాగించాల్సి ఉంటుందని పేర్కొన్నాడు.

2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఈ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 2011లో ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన కోహ్లీ, తన చివరి ప్రపంచకప్ ప్రయాణంలో వ్యక్తిగత మైలురాళ్ల కంటే జట్టు విజయానికే పెద్దపీట వేస్తున్నాడు. ఈ టోర్నీకి సిద్ధమయ్యే క్రమంలో వెస్టిండీస్‌తో ప్రస్తుత సిరీస్‌తో పాటు మరిన్ని వన్డే మ్యాచ్‌లలో భారత్ ఆడనుంది.

# భారత్-ఆఫ్ఘన్ క్వార్టర్ ఫైనల్‌కు వాన గండం

- ఆసియా క్రీడల్లో భారత్-ఆఫ్ఘన్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్
- పోరుకు అడ్డంకిగా మారిన భారీ వర్ష సూచన
- మ్యాచ్ రద్దయితే నేరుగా సెమీస్‌కు వెళ్లనున్న భారత్
- మెరుగైన ర్యాంకే టీమిండియాకు కలిసొచ్చే అంశం
- గతంలోనూ వర్షం కారణంగానే ఆఫ్ఘన్‌పై భారత్ స్వర్ణం కైవసం

**స్పోర్ట్స్ డెస్క్ :**

ఆసియా క్రీడల క్రికెట్ ఈవెంట్‌లో సోమవారం జరగనున్న క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌పై వర్షం ముప్పు పొంచి ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, ద్వితీయ శ్రేణి ఆఫ్ఘనిస్థాన్ జట్టుతో తలపడనుండగా, ఈ మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే, మెరుగైన ర్యాంకు ఆధారంగా టీమిండియా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్ ఈ కీలక పోరుకు వేదిక కానుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:30) భారత్‌ఆఫ్ఘన్ మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉంది. దీనికి ముందు ఉదయం 5:30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం 9 గంటలకు) పాకిస్థాన్, హాంకాంగ్ చైనా మధ్య తొలి క్వార్టర్ ఫైనల్ జరగనుంది. అయితే వాతావరణ సూచనల ప్రకారం, సోమవారం అక్కడ 97 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో రెండు మ్యాచ్‌ల నిర్వహణపై సందేహాలు నెలకొన్నాయి.

ప్రైవేటు వాతావరణ సంస్థ 'అక్యువెదర్' నివేదిక ప్రకారం, పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభమయ్యే సమయానికి 70 శాతం, భారత్ మ్యాచ్ టాస్ సమయానికి 40 శాతం వర్షం పడే సూచనలు ఉన్నాయి. రోజంతా వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో మ్యాచ్‌లు సజావుగా సాగడం కష్టంగా మారింది. నిబంధనల ప్రకారం, నాకౌట్ మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయితే, ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ముందున్న జట్లను విజేతలుగా ప్రకటిస్తారు.

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ వన్ స్థానంలో ఉండగా, ఆఫ్ఘనిస్థాన్ 10వ ర్యాంకులో ఉంది. అదేవిధంగా, పాకిస్థాన్ 6వ స్థానంలో, హాంకాంగ్ చైనా 24వ స్థానంలో కొనసాగుతున్నాయి. ఈ లెక్కన మ్యాచ్‌లు రద్దయితే భారత్, పాకిస్థాన్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. గతంలో 2023 ఆసియా క్రీడల ఫైనల్‌లోనూ భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వగా, మెరుగైన ర్యాంకు ఆధారంగా టీమిండియా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం గమనార్హం.




## పోల్చుకోవడానికి ఏముంది?.. వైభవ్‌పై ఎలాంటి జెలసీ లేదు..
# టీమిండియా స్టార్ సంచలన వ్యాఖ్యలు!

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌తో కలిసి ఆడటం ఎలా అనిపిస్తుందని అడిగిన ప్రశ్నకు జురెల్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. 15 ఏళ్ల వయసులోనే అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నాడని ప్రశంసించాడు. అతడిని చూసి తామంతా ఆశ్చర్యపోతుంటాం అని చెప్పాడు. అందరి ప్రశంసలకు వైభవ్ పూర్తి అర్హుడు అని పేర్కొన్నాడు. అయితే వైభవ్‌పై తనకు ఎలాంటి జెలసీ (ఈర్ష్య), పోలికలు లేవని జురెల్ స్పష్టం చేశాడు.

**ఎలాంటి జెలసీ లేదు:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ధ్రువ్ జురెల్, వైభవ్ సూర్యవంశీలు మాజీ ఛాంపియన్ రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వైభవ్ కోసం రాజస్థాన్ రూ.1.1 కోట్లు ఖర్చు చేయగా.. అతడు తనపై ఉంచిన నమ్మకాన్ని అద్భుతమైన ప్రదర్శనలతో నిలబెట్టుకున్నాడు. ఐపీఎల్‌తో పాటు భారత్ అండర్19, ఇండియాఏ జట్ల తరఫున కూడా వైభవ్ ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చి జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. ప్రముఖ వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా యూట్యూబ్ ఛానెల్‌లో ధ్రువ్ జురెల్ మాట్లాడుతూ.. వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. 'వైభవ్ ప్రశంసలకు అర్హుడు. అతడు ఆడుతున్న తీరును అసలు ఊహించలేం. 15 ఏళ్ల పిల్లాడు టాప్ బౌలర్లను కూడా చిత్తు చేస్తున్నాడు. అది నిజంగా అద్భుతం. ఇందులో ఎలాంటి జెలసీ లేదు. పోలికలు కూడా లేవు. ఎందుకంటే పోల్చుకోవడానికి ఏముంది?. అతడు మన ఊహకు అందని స్థాయిలో ఉన్నాడు. వైభవ్ గొప్ప ఆటగాడు. మేమంతా అతడిని చూసి ఆశ్చర్యపోతుంటాం. అతడు మా బ్యాటర్ల పనిని సులభం చేస్తున్నాడు' అని జురెల్ పేర్కొన్నాడు.

**ఆపకుండా బాదుతూనే ఉంటాడు:**

వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు తనపై కూడా ప్రభావం పడుతుందని జురెల్ చెప్పాడు. 'పవర్‌ప్లేలో వైభవ్ బౌలర్లపై విరుచుకుపడుతుంటే.. మేము కూడా అవకాశం వచ్చినపుడు దూకుడుగా ఆడాలనే ఉత్సాహం కలుగుతుంది. వైభవ్ వరుసగా బౌండరీలు కొడుతుంటాడు. అతడిని చూస్తుంటే మాకు కూడా భారీ షాట్లు ఆడాలి అనిపిస్తుంది. ఎందుకంటే వైభవ్ ఆపకుండా బాదుతూనే ఉంటాడు' అని జురెల్ చెప్పాడు. వైభవ్ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. జూలైలో ఇంగ్లండ్ పర్యటనలో టీ20 అంతర్జాతీయ అరంగేట్రం చేసిన అతడు.. ఆ సిరీస్‌లో 14, 13, 15 పరుగులు చేశాడు. ఆ తర్వాత జింబాబ్వేతో జరిగిన సిరీస్‌లో మాత్రం సత్తా చాటాడు. మూడు మ్యాచ్‌ల్లో 151 పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. చివరి మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కూడా అందుకున్నాడు.




**ప్లేయింగ్ ఎలెవన్‌లో కష్టమే:**

అయితే ఆ తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో వైభవ్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 30తో గెలిచినప్పటికీ.. వైభవ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. అతడి స్థానంలో సంజు శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చి అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేశాడు. ప్రస్తుతం వైభవ్ ఆసియా క్రీడలు 2026 కోసం ఎంపిక చేసిన భారత జట్టులో ఉన్నాడు. అయితే తుది జట్టులో సంజు వంటి సీనియర్ ఆటగాడు ఉండటం వల్ల వైభవ్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో అవకాశం వస్తుందో లేదో అన్నది ఆసక్తికరంగా మారింది.

# లేడీ ఓరియెంటెడ్ మూవీలో రెజీనా కసాండ్రా..



కంటెంట్ ఉన్న చిత్రాలు ఎంచుకుంటూ హీరోయిన్‌గారాణిస్తున్న రెజీనా కసాండ్రా.. ఇప్పుడు మరో ప్రయోగానికి సిద్ధం అయినట్లు తెలుస్తోంది. 'సిల నేరంగలిల్ సిల మనితర్గళ్' అండ్ 'బాంబ్' వంటి చిత్రాలతో దర్శకుడుగా గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ విశాల్ వెంకట్ దర్శకత్వంలో రాబోతున్న తదుపరి ప్రాజెక్టులో ఈ హీరోయిన్ ఓకే అయినట్లు తెలుస్తోంది. ఇదొక లేడీ ఓరియెంటెడ్ మూవీ అని తెలుస్తుండగా.. ఇందులో రెజీనా శక్తివంతమైన, బలమైన కేంద్ర పాత్రలో కనిపిస్తుందని తెలుస్తుంది. ఇక క్రేజీ ప్రాజెక్టు యొక్క రెగ్యులర్ షూటింగ్ ఇటీవల ఘనంగా స్టార్ట్ కాగా.. సైలెంట్‌గా చిత్రీకరణ పూర్తి చేస్తున్నారట మేకర్స్. అంతే కాకుండా.. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అండ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌కు చెందిన 'జి స్క్వాడ్' సంస్థలు ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయని తెలుస్తుండగా.. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట సందడి చేస్తున్నాయి.

# ఆ భారాన్ని మహిళలపై మోపడం ఆపండి!

సామాజిక మాధ్యమాల్లో స్త్రీ ద్వేషపూరిత చర్చను.. స్త్రీ, పురుషుల మధ్య పోరాటంగా చూడకూడదని అన్నారు హిందీ నటి కృతిసనన్. ఇటీవల బిహార్‌లోని జముయి జిల్లాలో ఓ మైనర్ విద్యార్థినిని చుట్టుముట్టి లైంగికంగా వేధించిన ఘటనపై సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాల నేపథ్యంలో.. ఆ సంఘటనను ప్రస్తావించకుండానే కృతి ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇది స్త్రీ, పురుషుల మధ్య పోరాటం కాదు. స్త్రీలను తక్కువగా చూసే పురుషులకు, అలాగే పితృస్వామ్యాన్ని ఒక సాంస్కృతిక విలువగా భావిస్తున్న స్త్రీలకు మధ్య జరుగుతున్న పోరాటం. లైంగిక హింస నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో మహిళలకు ఇంకెంత కాలం బోధిస్తూనే ఉంటారు? పురుషులకు మహిళలను వేధించవద్దని ఎందుకు చెప్పడం లేదు? ఒక మైనర్‌పై అత్యాచారం జరిగినప్పుడు ఆ దారుణానికి పాల్పడిన వ్యక్తి మనస్తత్వం ఎలాంటిది అని ఎందుకు ప్రశ్నించరు? దానికి బదులుగా అందరూ ఆ అమ్మాయి ఏ దుస్తులు వేసుకుంది, ఎక్కడ ఉంది, ఎవరితో ఉంది, ఎందుకు బయటకు వెళ్లింది, ఆమె కుటుంబం ఎందుకు అనుమతించింది అని అడుగుతూనే ఉంటారు. తమను తాము సురక్షితంగా ఉంచుకునేందుకు మరింత జాగ్రత్తగా ఉండాలని మహిళలకు ప్రతిసారీ చెప్పడం ఆపండి. పురుషులకు మహిళలను గౌరవంగా చూడటం, తమ హద్దుల్లో ఉండడం నేర్పించాలి. వారి ప్రవర్తనకు బాధ్యత వహించడం, అంగీకారం, గౌరవం అంటే ఏమిటో తెలియజేయాలి. తప్పుగా ప్రవర్తించే పురుషుల తప్పుల భారాన్ని మహిళలపై మోపడం ఆపండి" అని అందులో పేర్కొన్నారు కృతి.





# నన్ను అర్ధాంతరంగా తొలగించి అన్‌లక్కీ హీరోయిన్‌గా ముద్రవేశారు..

బాలీవుడ్‌లో వరుస సినిమాలతో దూసుకుపోతున్న స్టార్ బ్యూటీ తాప్సీ పన్ను తన సినీ కెరీర్‌లో ఎదురైన షాకింగ్ అనుభవాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమాలు షూటింగ్ దశలో ఉన్నప్పుడు లేదా డేట్స్ లాక్ చేసుకున్న తర్వాత కూడా తనను సడన్‌గా ప్రాజెక్ట్‌ల నుంచి తప్పించిన సందర్భాలు ఉన్నాయని వెల్లడించారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా కేవలం హీరోల ఇగో, భార్యల అభద్రతాభావం వల్లే కొన్ని సినిమాల నుంచి తనను తొలగించారని తాప్సీ తెలిపారు. ఒకానొక సందర్భంలో సినిమా షూటింగ్‌కు డేట్స్ అన్నీ లాక్ చేసుకున్న తర్వాత తనను ప్రాజెక్ట్ నుంచి తీసేశారని చెప్పారు. అసలు కారణం ఏంటని తాను పదే పదే ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం చెప్పలేదని, బహుశా ఆ హీరోకు తనకు ఇష్టమైన మరో హీరోయిన్‌ను తీసుకోవాలనిపించి ఉండవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

అయితే తనకు కెరీర్‌లో ఎదురైన వాటిలో అత్యంత చెత్త కారణం ఏమిటంటే.. "హీరో భార్యకు నువ్వంటే ఇష్టం లేదు, అందుకే నిన్ను సినిమా నుంచి తొలగించాం" అని చెప్పడమేనని తాప్సీ షాకింగ్ నిజం బయటపెట్టారు. ఒకనొక దశలో, తన సినిమాలు వరుసగా విఫలమయ్యాక, తనను అన్‌లక్కీ హీరోయిన్‌గా ముద్రవేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, సినిమాల్లో గ్లామర్ పాత్రల గురించి మాట్లాడుతూ.. తాను మొదట్లో సినిమాల్లో నటించేటప్పుడు ఆ సన్నివేశాలు ఏ విధంగా వస్తాయో సరిగ్గా అర్థమయ్యేది కాదని అన్నారు. కానీ సినిమా తెరపై చూసిన తర్వాత కొన్ని సీన్లు మరీ ఎక్కువగా, అసహజంగా చూపించినట్లు అనిపించిందని వాపోయారు. ఏ సినిమాలోనైనా అందంగా, గ్లామర్‌గా కనిపించవచ్చు కానీ.. దాన్ని అనవసరంగా అసభ్యకరంగా చూపించడం సరికాదని తాప్సీ అభిప్రాయపడ్డారు. ఇండస్ట్రీలో హీరోయిన్లు ఎదుర్కొంటున్న ఈ తీరుపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.

# మీ ప్రయాణం ప్రత్యేకమైనది..



హీరో కార్తీ పోలీస్ శాఖపై చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కోయంబత్తూరులో జరిగిన 'మాజీ పోలీసు అధికారుల పబ్లిక్ వెల్ఫేర్ ట్రస్ట్' 10వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. తమిళనాడు పోలీసుల పనితీరు, వారిపై ఉండే ఒత్తిడి గురించి మాట్లాడుతూ.. 'ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం వల్ల పోలీస్ శాఖపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. ఇన్‌స్టామార్ట్‌లో ఆర్డర్ చేసినట్టుగా, ప్రజలు ఒక గంటలోపే పోలీసులు నేరాన్ని పరిష్కరించాలని ఆశిస్తున్నారు. అయినప్పటికీ, పోలీసులు సోషల్ మీడియాను సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారు. వారికి సెలవులు ఉండవు. కొత్త ప్రభుత్వం వారానికి ఒకరోజు సెలవు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ సిబ్బంది కొరత కారణంగా అది ఇప్పటికీ కాగితాలపైనే ఉంది. ఇప్పుడు 10,000 మంది సిబ్బందిని నియమించబోతున్నారని వింటున్నాను. ఇది నిజంగా సంతోషించాల్సిన విషయం. అదంతా పక్కకు పెడితే పోలీసుల కోసం నేను ఒక్క విషయం చెప్పాలనుకుంటున్నాను.. ఎప్పుడూ మిమ్మల్ని మీరు మరెవరితోనూ పోల్చుకోకండి. మీకంటే ఎవరూ తక్కువ కాదు. మీకంటే ఎవరూ ఎక్కువ కాదు. మీతో ఎవరూ సమానం కాదు. మీ ప్రయాణం ప్రత్యేకమైనది. మీరు చరిత్ర సృష్టించగలరు' అంటూ పోలీసులపై ప్రశంసలు కురిపించాడు కార్తీ.

# వ్యక్తిగత కారణాలు, తప్పుడు నిర్ణయాల వల్ల తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొన్నా

టాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ నివేతా పేతురాజ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, త్వరలో 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నివేతా తన గత జ్ఞాపకాలను పంచుకుంటూ ఎమోషనల్ అయ్యారు. 2023లో కొన్ని పొరపాట్లు, వ్యక్తిగత కారణాల వల్ల తాను తీవ్రమైన డిప్రెషన్, ఒత్తిడిని ఎదుర్కొన్నానని చెప్పారు. ఆ కష్టకాలం నుంచి బయటపడేందుకు చాలా సమయం పట్టిందని, అప్పట్లో సినిమాలను పూర్తిగా వదిలేయాలని కూడా ఆలోచించినట్లు తెలిపారు. అయితే అదృష్టవశాత్తూ పరిస్థితులు చక్కబడి మళ్లీ మంచి అవకాశాలు రావడంతో తిరిగి నటనపై దృష్టి పెట్టానని అన్నారు.

అలాగే తన కెరీర్ మొదట్లో సొంత రూపంపై అసంతృప్తితో పెదవులకు సర్జరీ చేయించుకోవాలని భావించినట్లు సంచలన నిజం బయటపెట్టారు. ఆ విషయంపై డాక్టర్‌ను సంప్రదించగా.. ఆయన గట్టిగా హెచ్చరించడంతో ఆ ఆలోచనను విరమించుకున్నట్లు తెలిపారు. సాయి పల్లవి, నిత్యామీనన్ లాంటి నటీమణులు ఎలాంటి సర్జరీలు లేకుండా తమ సహజ సౌందర్యంతోనే ప్రేక్షకులను అలరిస్తున్నారని, వారిని చూశాకే తన రూపురేఖల గురించి అనవసరంగా టెన్షన్ పడ్డానని గ్రహించినట్లు చెప్పారు. సాయి పల్లవి ఇచ్చిన స్ఫూర్తితోనే ప్లాస్టిక్ సర్జరీ ఆలోచనను పూర్తిగా మార్చుకున్నానని నివేతా స్పష్టం చేశారు. కష్టకాలం నుంచి బయటపడి ఇప్పుడు మళ్లీ బిజీ లైఫ్‌లోకి రావడం చాలా ఆనందంగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.



# సోషల్ మీడియా వివాదాలకు దూరంగా ఉండండి..



సోషల్ మీడియాలో జరిగే అనవసర వివాదాలకు దూరంగా ఉండాలని కోలీవుడ్ స్టార్ హీరో సూర్య (Suriya) తన అభిమానులకు సూచించారు. నెగిటివ్ పోస్టులకు స్పందిస్తూ సమయం వృథా చేసుకోవద్దని హితవు పలికారు. ఇటీవల తన అభిమాన సంఘాల సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

''సోషల్ మీడియాలో ఎవరో ఏదో పోస్ట్ చేశారని.. దానికి బదులిస్తే మనకీ వాళ్లకీ తేడా ఉండదు. మన పని మనం చేసుకుందాం.. వాళ్లను వాళ్లలాగే ఉండనిద్దాం. ఎదుటివారిని మార్చడం చాలా కష్టం. విమర్శించే వారికి సమాధానం చెబుతూ మీ శక్తిని వృథా చేసుకోకండి. మనం కేవలం ప్రేమను మాత్రమే పంచుదాం. ప్రతిరోజూ మీరు చేసే పనిపై దృష్టిపెట్టండి. కచ్చితంగా విజయం సాధిస్తారు'' అని సూర్య వివరించారు. ఇటీవల హీరో శివకార్తికేయన్ (Sivakarthikeyan).. 'సర్దార్ 2', 'మండాడి' (Mandaadi) చిత్ర బృందాలను అభినందిస్తూ చేసిన పోస్టులు సూర్య అభిమానుల మధ్య భిన్నాభిప్రాయాలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో నెట్టింట జరుగుతున్న చర్చలను ఉద్దేశించే సూర్య ఈ వ్యాఖ్యలు చేసినట్లు అభిమానులు భావిస్తున్నారు. అయితే, సూర్య ఎవరి పేరు ప్రస్తావించకుండానే ఈ సున్నితమైన సందేశం ఇచ్చారు. ఈ ఏడాది 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో సూర్య మంచి ఫామ్‌లో ఉన్నారు. మలయాళ స్టార్ డైరెక్టర్ జీతు జోసెఫ్ దర్శకత్వంలో ఆయన నటించిన తదుపరి చిత్రం 'సీన్' (Scene). ఈ దీపావళి కానుకగా నవంబరు 6న ఈ సినిమా థియేటర్లలో సందడి చేయనుంది.

# నాలుగు సిరీస్‌లుగా 'రణబాలి' డాక్యుమెంటరీ..



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ (Vijay Deverakonda) నటిస్తున్న తాజా పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి' (Ranabaali). ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదలైన 'ఎందయ్యా సామి' (Endayya Saami) సాంగ్ మంచి టాక్‌ను సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఈ సానుకూల స్పందనని మరింతగా పెంచేందుకు మేకర్స్ సరికొత్త ప్రమోషనల్ స్ట్రాటజీతో ముందుకొచ్చారు. ఇందులో భాగంగా సినిమాకు సంబంధించిన ఓ స్పెషల్ డాక్యుమెంటరీ సిరీస్‌ను విడుదల చేయనున్నారు.

మొత్తం నాలుగు ఎపిసోడ్‌లుగా రానున్న ప్రమోషన్ సిరీస్‌లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (Rashmika), దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ స్వయంగా పాల్గొననున్నారు. సినిమా గురించి, ఆ కథ వెనుక ఉన్న ఎన్నో ఆసక్తికరమైన విషయాలను వారు ఇందులో పంచుకోనున్నారు. ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తోంది. వివాహం తర్వాత విజయ్, రష్మిక కలిసి నటించిన తొలి చిత్రమిదే. దసరా కానుకగా అక్టోబర్ 16న థియేటర్లలో ఈ మూవీ భారీ స్థాయిలో విడుదల కానుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,**
Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com